
ఆదివారం **వార్త**

10 డిసెంబరు, 2023



# సొరంగంలో మరణ మృదంగం!



# త్రివిక్రమ్, అల్లు అర్జున్ కాంబినేషన్‌లో మరో సినిమా

త్రివిక్రమ్ దర్శకత్వంలో చేయడానికి స్టార్ హీరోలంతా ఆసక్తి చూపిస్తుంటారు. ఆయన కథల్లో అన్ని వర్గాల ప్రేక్షకులకు కావలసిన అంశాలుంటాయి. త్రివిక్రమ్ దర్శకత్వంలో అల్లు అర్జున్ చేసిన మూడు సినివ  ా లు భారీ విజయం సాధిం చా యి. వీరి కాంబినేషన్ లో వచ్చిన 'జులాయి', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'అల వైకుంఠపురములో' ఒక దానిని మించి మరొకటి భారీ విజయాలు సాధించా యి. ఇదే కాంబినేషన్‌లో మరో ప్రాజెక్టు త్వరలో పట్టా లెక్క నుందని సమాచారం. మహేశ్‌బాబు సినిమా తరు వాత త్రివిక్రమ్ చేయ నున్న ప్రాజెక్టు ఇదేనని చెప్ప వచ్చు. ఈ చిత్రం పాన్ ఇండియా రేంజ్‌లో వుంటుందని తాజా సమాచారం.

## తారాతీరం

# అల్లరి నరేష్ కొత్త సినిమా!

'ఉగ్రం' తర్వాత అల్లరి నరేష్ సుబ్బు మంగదేవి దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాలో ప్రేక్షకులను అలరించడానికి రెడీ అవుతున్నాడు. ఈ చిత్రం ఈ మధ్యే ప్రారంభమైంది. ఈ సినిమాకి 'బచ్చలమల్లి' అనే టైటిల్‌ను ఖరారు చేసారు. మూర్ఖత్వానికి పేరు గాంచిన పాత్రకి సంబంధించిన కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కనుంది. **90**వ దశకం నేపథ్యంలో రూపొందనున్న ఈ సినిమాలో రావురమేష్, హరితేజ, ప్రవీణ్ మొదలైన వారు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. హాస్య మూవీస్ పతాకంపై రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మిస్తు న్నారీ చిత్రాన్ని. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నా ఈ చిత్రం గురించి మరిన్ని వివరాలు త్వర లో వెల్లడి కానున్నాయి.



ఆదివారం వార్త
10 డిసెంబరు, 2023

## మంచి ముత్యాలు

ప్రేమ ఒక పర్యాయం వంచించబడినప్పుడు
మరెప్పుడూ వికసించదు.

\- థామస్ మూర్

## విషయ విశేషం

ఆమె పోరాటం ఓ ఆదర్శం.. 4
'సంఘీ'భావం....5
అంతరించిపోతున్న పచ్చదనం
కవర్ స్టోరీ..6
సారంగంలో
మరణ మృదంగం!
లీటర్ నూనె రూ.20వేలు...10
ఈవారం కవిత్వం..12
గాడి తప్పనివ్వకు
ఆరోగ్య ఉ'సిరి'....14
కథ.. 20
స్నేహబంధం
సాహిత్యం..23
తెలంగాణ పత్రికా రంగంలో
తిరుగుబాటు చైతన్యం
బొమ్మల్లో యువరాణి 'బార్బీ'...25
వాస్తు దోషాలున్నాయా?...29
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..

## తాజా వార్తలు

### ఈ బిచ్చగాడు కోటీశ్వరుడు



ధనవంతులైన వ్యాపారవేత్తలూ, సినీనటులూ, క్రికెటర్ల గురించి మనం చదువుతుంటాం. సంపన్నుడైన బిచ్చగాడి గురించి ఎప్పుడైనా విన్నారా? ఆయన సంపన్నుడైతే బిచ్చగాడు ఎలా అవుతాడు అనే కదా సందేహం. అక్కడే ఉంది అసలు ట్విస్ట్. ముంబయికి చెందిన భరత్‌జైన్ దాదాపు 30ఏళ్లుగా భిక్షాటన చేస్తూ దాదాపు ఎనిమిది కోట్ల రూపా యలు కూడబెట్టాడు. ముంబయిలోని ఖరీదైన ఏరియా బాంద్రాలో సుమారు కోటిన్నర విలువ చేసే రెండు ప్లాట్లు, ఠాణెలో రెండు షాపులు ఉన్నాయి. వాటిద్వారా వచ్చే అద్దె నెలకి లక్షపైనే. పిల్లల్ని కార్పొరేట్ స్కూల్లో చదివిస్తున్న భరత్ జైన్ ముప్పైఐదేళ్ల క్రితం దిక్కుతోచని స్థితిలో యాచకుడిగా మారాడు. వచ్చిన ప్రతి రూపాయినీ పొదుపు చేస్తూ కోటీశ్వరుడయ్యాడు. అయినా యాచన ను మానకుండా ఛత్రపతి శివాజీ టెర్మినల్, ఆజాద్‌మైదాన్ వద్ద భిక్షాటన చేస్తూ నెలకి డెబ్భైవేలకుపైనే సంపాదిస్తున్నాడు. అందుకే ప్రపంచంలోనే సంపన్న బిచ్చగాడిగానూ గుర్తింపు పొందాడు.

### సౌరశక్తితో నీరు శుభ్రం

ప్రపంచవ్యాప్తంగా నీటి కాలుష్యం లక్షలాది మరణాలకు కారణమవుతోంది. వెనుకబడిన ఆసియా, ఆఫ్రికా దేశాల్లో నీటి కాలుష్యం వల్ల సంభవించే మరణాలు చాలా ఎక్కువ. ఈ సమస్యకు పరిష్కారంగానే అమెరికన్ కంపెనీ 'గ్రావిస్టిల్' ఇటీవల 'స్టిల్' పేరుతో పూర్తిగా సౌరశక్తితో పనిచేసే వాటర్ ఫిల్టర్‌ను తక్కువ ధరలోనే అందుబాటులోకి తెచ్చింది. దీనిపైభాగంలో ఉండే ఫ్రెస్నెల్ లెన్స్ ద్వారా ప్రసరించే సూర్యకాంతి ఈ ఫిల్టర్ ట్యాంకులోని నీటిలో ఉండే సూక్ష్మక్రిములను పూర్తిగా నాశనం చేస్తుంది. వెదురుతో తయారైన ఫిల్టర్ ఎక్కువకాలం మన్నుతుంది. 12 లీటర్ల సామర్థ్యం కలిగిన ఈ సోలార్ వాటర్ ప్యూరిఫైయర్ ఆరుగురు సభ్యులు ఉండే కుటుంబానికి సరిపోతుంది.



మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com



# ఆమె పోరాటం ఓ ఆదర్శం

**ఆధునిక** మహిళ ఇంటాబయటా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నది. ఒకవైపు తనను తాను నిరూపించుకుంటూ, మరోవైపు కెరీర్‌లో ఎదురవుతున్న సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ, తన ఉనికిని చాటుకుంటున్నది. తాను ఏది చేసినా, ఏం చేసినా తన కుటుంబం కోసమే. ఆర్థికంగా తన కుటుంబం బాగుండాలనే ఆరాటం, పోరాటంలో ఎన్నో ఇబ్బందులు ఎదురౌతున్నా వాటన్నింటినీ దిగ్విజయంగా జయిస్తూ, ముందుకు సాగిపోతున్నది. అయితే ఈ పోరాటంలో కొన్నిసార్లు ఓటమి చవిచూడవచ్చు. ఇంకా చెప్పాలంటే ప్రాణాలు కోల్పోవచ్చు. ఇలా వృత్తిలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ, పోరాడుతూ చివరికి మరణించిన పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ లేడీ సింగం జున్మోని. గత మే 15వ తేదీన జున్మోని మరణం తీవ్రసంచలనంగా మారింది. అస్సాం పోలీస్ లేడీగా పేరొందిన జున్మోని తన వృత్తిలో భాగంగా ఎన్నో సంచలన నిర్ణయాలతో అనతికాలంలోనే నేరస్తుల గుండెల్లో గుబులు పుట్టించింది. జున్మోని ప్రయాణిస్తున్న కారును ఓ ట్రక్కు గుద్దుకోవడంతో ఆమె అక్కడిక్కడే మరణించింది. అయితే జున్మోని (30) మృతి సంఘటన పలు సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆమె ప్రమాదవశాత్తు మృతి చెందలేదని, కావాలనే ఎవరో కుట్ర చేసి హత్య చేశారని జున్మోని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు.



దీనికితోడు ఇటీవల ఓ ఆడియో వెలుగులోకి వచ్చింది. జున్మోని రభాను పోలీసుశాఖలోని కొందరు ఉన్నత అధికారులు చిత్రహింసలు పెట్టి చంపారంటూ ఓ కానిస్టేబుల్ ఆడియో క్లిప్‌ను విడుదల చేసినట్లు తెలుస్తోంది. రాభా అనుమానాస్పద మరణంపై దర్యాప్తు చేస్తున్న సిఐడీ అధికారులు ఆ కానిస్టేబుల్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

జున్మోనీ రభా తనకు కాబోయే భర్తను అరెస్టు చేసి మరీ దేశ వ్యాప్తంగా పాపులర్ అయ్యారు. మే 15వ తేదీన జున్మోని తన వ్యక్తిగత పనిపై వెళ్తున్న ఆమె ప్రయాణిస్తున్న కారును ఓ ట్రక్కు బలంగా ఢీకొట్టడంతో అక్కడిక్కడే ఆమె మృతి చెందింది. అసోంలోని నాగోవ్ జిల్లా కాలియాబోర్ సబ్ డివిజన్‌లో సరుభుగియా గ్రామం వద్ద ఈ ఘటన జరిగింది. అర్ధరాత్రి రెండున్నర గంటల ప్రాంతంలో పెట్రోలింగ్ వాహనం ఈ యాక్సిడెంట్‌ను గుర్తించి.. ఆమెను ఆసుపత్రికి తరలించింది. అయితే అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు తెలిపారు. ఘటన జరిగిన వెంటనే డ్రైవర్ పరారయ్యాడు. ఉత్తరప్రదేశ్‌కి చెందిన ఆ ట్రక్కును పోలీసులు సీజ్ చేశారు. భద్రత లేకుండానే ఆమె ప్రయాణం చేయగా ఆ ప్రయాణ వివరాలు తమకు తెలియదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. జున్మోని రభా..ధైర్యశాలి అధికారిణిగా పేరుంది.

గతంలో మోరికోలాంగ్ పోలీస్ అవుట్‌పోస్ట్‌లో ఎస్సైగా పని చేశారు. ఎంతో సంక్లిష్టమైన కేసుల్ని సాహసోపేతంగా డీల్ చేశారామె. అదే సమయంలో ఆమెపై పలు వివాదాల్లో కూడా చిక్కుకున్నారు. ఆ సమయంలో ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నవారిపై ఆమె ఉక్కుపాదం మోపరామె. అయితే గత జూన్‌లో ఆ అవినీతిలో ఆమెకు భాగం ఉందంటూ అభియోగాలు రావడంతో ఆమె అరెస్టు అయ్యారు. ఆపై సస్పెన్షన్‌వేటు పడింది. సస్పెన్షన్ ముగియడంతో తిరిగి ఆమె డ్యూటీలో జాయిన్ అయ్యారు. 2022 జనవరిలో బిజెపీ ఎమ్మెల్యే అమియాకుమార్ భుయాన్‌తో ఆమె జరిపిన ఫోన్ సంభాషణ లీక్ కావడం కూడా పెను దూమారమే రేపింది. జున్మోని రభా తాజా పోస్టు మార్టం రిపోర్టులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. జున్మోని శరీరంపై వెనుకభాగంలో అనేక గాయాలు ఉన్నట్లు వెల్లడికావడం పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బ్రెయిన్ హెమరేజ్, కార్డియా అరెస్టు కారణంగా జున్మోని రభా మరణించారని కూడా ఈ నివేదికలో వెల్లడైంది. పక్కా ప్రణాళిక ప్రకారమే ఈ హత్య జరిగినట్లు ఆమె తల్లి సుమిత్రా రభా ఆరోపిస్తున్నారు. ఏదిఏమైనా ఆమె తన వృత్తిని ఒక సవాలుగా తీసుకుని, ఎంతో ధైర్యసాహసాలతో పనిచేశారు. అవినీతిపై ఆమె ఉక్కుపాదం మోపి, పోరాడి, చివరికి విషాదంగా మరణించడం దురదృష్టకరం. అయినా ఆమె నేటిమహిళకు ఆదర్శంగా నిలిచారు. బెదిరింపులకు ఏమాత్రం లొంగకుండా, సాహసంగా పనిచేశారు.


## 'సంఘీ' భావం



# అంతరించిపోతున్న పచ్చదనం

భూమిపై ఉండాల్సిన పచ్చదనం క్రమంగా తగ్గిపోతోంది. నగరాలు విస్తరించడం, అవసరాలకు అనుగుణంగా విచక్షణ లేకుండా చెట్లను నరికివేయడం వంటి చర్యలు పరిధికి మించి జరుగుతుండటంతో పర్యావరణ సమతుల్యతకు విఘాతం ఏర్పడుతోంది. ముఖ్యంగా పట్టణాలు, నగరాల్లో పచ్చదనం మచ్చుకు కూడా లేకుండా పోతోంది. నగరీకరణ, ఆధునీకరణ పేర్లతో చెట్లను నరికివేస్తున్నారు. చెట్టుకు పోషణను ఇచ్చే చెరువులు, కుంటలను కూడా కప్పివేస్తూ బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు. పచ్చదనం లేకపోవడం వల్ల ప్రకృతి వైపరీత్యాలతో పాటు అనేక అనర్థాలను ఎదుర్కోవలసి వస్తోంది. కేంద్రంలోను, రాష్ట్రంలోను సామాజిక అడవులు అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వశాఖలు ఉన్నప్పటికీ ఆశించిన ఫలితాలను సాధించలేకపోతున్నాయి. ఒక పక్క పచ్చదనాన్ని పెంచకపోగా మరోపక్క ప్రజల ఆవాసాలకు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో చెట్లను కూడా నరికివేస్తున్నారు. ప్రతి ఏటా అడవులు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. విదేశాల్లో చెట్ల పెంపకం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. అదేవిధంగా చెట్లను అనుమతి లేకుండా తొలగిస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నారు. రహదారి నిర్మించాలంటే ఆ ప్రాంతంలో ఉన్న చెట్లను తొలగించాల్సి వస్తే అంతకు నాలుగు రెట్ల వృక్షాలను పెంచే బాధ్యతను అప్పగిస్తున్నారు. అదేవిధంగా గృహాలు నిర్మించే సమయంలో తప్పనిసరిగా చెట్ల పెంపకం నిబంధనను పెడుతున్నారు. మన దేశంలో కూడా ఈ నిబంధన ఉన్నప్పటికీ ఆచరణలో మాత్రం ఉండటం లేదు. ఒక కర్మాగారాన్ని నిర్మిస్తే దాని చుట్టుపక్కల సుమారు 5 కిలోమీటర్ల వరకు గ్రీన్ బెల్ట్ నిర్మాణం జరగాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. కొత్తకొత్త ఫ్యాక్టరీలు వెలుస్తున్నా వృక్షాలను పెంచే గ్రీన్‌బెల్ట్‌లు మాత్రం కనిపించడం లేదు. మన దేశంలో బెంగుళూరును గ్రీన్ సిటీగా పేర్కొంటారు. అయితే గత మూడు దశాబ్దాలను పరిశీలిస్తే 90 శాతం వరకు భవననిర్మాణాలతో నింపివేశారు. బెంగుళూరు విషయంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ నివేదికలు పరిశీలిస్తే ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తున్నాయి. బెంగళూరులో నీటి వనరులు కూడా 75 శాతం తగ్గిపోయి అక్కడ బహుళ అంతస్థుల భవనాలు వెలిసాయని వెల్లడిఅయ్యింది. ఆర్థిక, వాణిజ్య కేంద్రంగా చెప్పుకునే ముంబయిలో 60 శాతం పచ్చదనం, 65 శాతం నీటివనరులు కనుమరుగయ్యాయి. హైదరాబాద్, చెన్నయ్, కలకత్తా వంటి నగరాల్లో కూడా ఇదే విధమైన పరిస్థితి నెలకొంది. ప్రకృతి సమతుల్యత లోపించడం వల్ల తుఫానుల ప్రభావం,ఎండ తీవ్రత వంటివి పెరుగుతున్నాయి. చెన్నయ్ నగరం సంవత్సరంలో మూడు నాలుగు సార్లు భారీ నుంచి అతి భారీ తుఫాను ముప్పును ఎదుర్కొంటోంది. అక్కడ వర్షం వస్తే వీధులు చెరువులను మరిపిస్తున్నాయి, కార్లు, బైకులు వర్షం నీటిలో కొట్టుకుపోయి నాలుగైదు కిలోమీటర్ల దూరంలో దర్శనమిస్తున్నాయి. హైదరాబాద్ నగరంతో పాటు వరంగల్ కూడా తుఫాను ముప్పును ఎదుర్కొంటోంది. ఒకసారి వర్షాలు ప్రారంభమైతే ఊళ్లు మునిగే వరకు ఏకధాటిగా పడుతూనే ఉంది. దీనినే క్లౌడ్ బరస్ట్ అని కూడా అంటున్నారు. వాస్తవానికి 1964లో నుంచే హరితవనాలు పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. 2008 నుంచి హరితవనాల పెంపు జోరందుకుంది. అయితే నగరీకరణ అధికం కావడంతో పెరిగిన చెట్లను నరికివేస్తున్నారు. ఇది పెనుసవాల్‌గా మారింది. దీనికి తోడు వాహనాల సంఖ్య పెరగడం, ఏసీల వాడకం విచ్చలవిడిగా సాగడంతో కర్బనం ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. ఈ ప్రభావం చెట్లపైనా మొక్కలపైనా చూపించడం ప్రారంభించింది. జలవనరుల పరిరక్షణ కీలకమని భావించిన కేంద్ర ప్రభుత్వం జాతీయ కార్యాచరణ ప్రణాళికను ప్రకటించింది. ఐక్య రాజ్యసమితి చేసిన అనేక సూచనలు కూడా పరిగణనలోకి తీసుకున్నారు. గ్రీన్ ఇండియా జాతీయ మిషన్, జాతీయ నీటి మిషన్ వంటి 12 కార్యక్రమాలకు రూపకల్పన జరిగింది. అయితే వీటి అమలులో అనేక సమస్యలు తలెత్తాయి. ముఖ్యంగా ఆర్థిక అడ్డంకులు, వివిధ మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయ లోపం, ప్రాజెక్టుల అనుమతుల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకోవడం వంటి అనేక కారణాల వల్ల ఈ ప్రణాళికలు కొన్ని కార్యరూపం దాల్చక పోగా మరికొన్నింటి అమలు అంతంత మాత్రంగానే మారింది. భవంతులు నిర్మించడంలోను, రియల్ ఎస్టేట్ రంగాన్ని అభివృద్ధి చేయడంలో చూపిస్తున్న శ్రద్ధ, చొరవను ప్రభుత్వాలు ఈ పథకాల అమలుపట్ల చూపించలేకపోయాయి. కొన్ని సందర్భాల్లో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి హరిత వనాలు నిర్మించినా వాటి నిర్వహణపై శ్రద్ధ చూపకపోవడం వల్ల అవి ఎండిపోయాయి. మొక్కలు నాటే సమయంలో మంత్రులు, ప్రముఖులు హడావిడి చేసి వెళతారు, ఆ తరువాత నాటిన మొక్కలను పట్టించుకునే వారు లేకుండా పోతున్నారు. చెట్లకు నీరు పోయడానికి, వాటిని రక్షించడానికి తోటమాలి వంటి పనివారి అవసరం ఉంటుంది. అయితే వారికి ప్రభుత్వాలు నియమించడం లేదు. ఏదో ఒక ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న నాల్గవ తరగతి ఉద్యోగులకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. దేశ రక్షణ కోసం ప్రభుత్వం ఎంత శ్రద్ధ చూపుతుందో అదే స్థాయి దేశంలో పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం అంటువ్యాధుల కాలం కొనసాగుతోంది. ప్రజలకు నాణ్యమైన ఆక్సిజన్ అందకపోవడంతో ఊపిరితిత్తులు వంటివి బలహీనపడి ఉన్నాయి. వాహనాల నుంచి వెలువడే కాలుష్యాన్ని ప్రస్తుతం అందుబాటులో ఉన్న చెట్లు ఏమాత్రం తగ్గించలేకపోతున్నాయి. ప్రజల్లో కూడా వాతావరణ సమతుల్యత దెబ్బతిన అనేక రుగ్మతల బారిన పడుతున్నారు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# సొరంగంలో మరణ మృదంగం!

కవర్‌స్టోరీ

**షేక్ అబ్దుల్ హాకీం జాని**

**ఈమధ్య భారతీయుల** హృదయాలను ఒక వార్త కలచివేసింది. ఉత్తరాఖండ్ చార్‌ధామ్ మార్గంలో ఉత్తరకాశీలో నిర్మాణంలో ఉన్న సిల్క్యారా సొరంగం 2023 నవంబర్ 12న పాక్షికంగా కూలిపోవడంతో దాని లోపల చిక్కుకున్న 41 మంది కూలీలను రక్షించేందుకు జాతీయ విపత్తు విభాయక దళం (ఎన్‌డీఆర్ఎఫ్), చమురు సహజ వాయు సంస్థ (ఓఎన్‌జీసీ), రక్షణ పరిశోధన సంస్థ డీఆర్‌డిఓ), సట్లెజ్ జల విద్యుత్ నిగమ్‌తోపాటు బీఆర్వో, ఐటీబీపీ ఇత్యాది సంస్థలు రంగంలోకి దిగాయి. కూలీలకు ఆక్సిజన్ సరఫరా చేసేందుకు ఏర్పాటు చేశారు. సొరంగంలో చిక్కుకున్న కూలీలతో చిన్న పైప్ ద్వారా ఏర్పడిన అనుసంధానత వల్ల వారంతా క్షేమంగా ఉన్నారని నిర్ధారణ జరిగింది. 17రోజుల పాటు అనేక ప్రయత్నాలు చేసి ఎట్టకేలకు 2023 నవంబర్ 28న 41మంది కార్మికులను సిల్క్యారా సొరంగం నుండి సురక్షి తంగా బయటకు తేగలిగారు. భారీ యంత్రాలు మొరాయించి నప్పటికి సాంకేతిక నిపుణుల సహకారంతో నిపుణులైన కూలీలు చేతులతో నేర్పుగా తవ్విన సొరంగం ఆ 41మందికి ప్రాణభిక్ష పెట్టింది. తొలుచుకుంటూ వెళ్లిన మార్గం మేరకు వెడల్పైన పైపుగొట్టాలను ప్రవేశపెట్టి నిష్క్రమణ మార్గాన్ని సిద్ధం చేయడం తో కూలీలంతా ఒక్కొక్కరుగా బయటి ప్రపంచంలోకి వచ్చారు. కాగా 17 రోజులుగా సొరంగంలో చిక్కుకున్న 41మంది కూలీలు వివిధ రాష్ట్రాలకు చెందిన వారు. వీరిలో అత్యధికంగా 15మంది కూలీలు జార్ఖండ్‌కు చెందిన వారు కాగా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారు 8మంది, బీహార్‌కు చెందిన వారు ఐదుగురు, ఒరిస్సాకు చెందిన వారు ఐదుగురు, బెంగాల్‌కు చెందిన వారు ముగ్గురు, అస్సాంకు చెందిన వారు ఇద్దరు, ఉత్తరాఖండ్‌కు చెందిన వారు ఇద్దరు, హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన ఒ కూలీ ఉన్నారు. వీరంతా నవంబర్ 12వ తేదీన రాత్రి టన్నెల్‌లో పనిచేస్తున్న సమయంలో సొరంగం మట్టి కూలిపో వడంతో అందరూ అందులో చిక్కుకున్నారు. సొరంగంలో చిక్కుకున్న వీరింతా 17రోజుల తరువాత క్షేమంగా బయటప డటంతో కథ సుఖాంతమైంది. అందరూ ఊపిరిపీల్చుకున్నా రు. ఈ కూలీలను టన్నెల్ నుండి బయటకు తీయడానికి 12మంది సభ్యుల కూలీల బృందం చేసిన కృషి శ్లాఘనీయం. నిలువు కాళ్లపై గంటల కొద్దీ నిలబడ్డాను అనే మాటలు మనం నిత్యం వింటూనే ఉంటాము. మున్నా ఖురేషి, మోనూ కుమార్, ఫిరోజ్ ఖురేషి, నిసార్‌ఖాన్, జతిన్, దేవేంద్రకుమార్, వకీన హసన్, ఇర్షాద్ అన్సారి రాషిద్ అన్సారి, నసీమ్ మాలిక్, సౌరబ్, అంకుర్ వీరంతా రెండు అడుగుల వెడల్పున్న గోతుల్లో సైతం తమ శరీర బరువును కాలివేళ్లపై ఉంచి అటువంటి రిస్క్ ఆపరేషన్లు చేయగలరు. అంతటి నైపుణ్యం గల ఈ కూలీల సహకారంతో సొరంగంలో ఇరుక్కున్న 41మంది కార్మికుల ప్రాణాలు కాపాడటంలో మార్గం సుగమమైంది. వీరంతా రీల్ హీరోలు కాదు. రీయల్ హీరోలు. కోల్‌కత్తా నుండి వెలువడుతున్న టెలిగ్రాఫ్ పత్రిక ఈ రీయల్ హీరోల బృందం ఫొటోను తమ పత్రిక సింహాభాగంలో ప్రచురించి ప్రశంసించింది.

దాదాపు ఐదేళ్ల క్రితం మేఘాలయలోని తూర్పు జైంటియా పర్వత ప్రాంతంలో అక్రమ మైనింగ్ 15మంది కార్మికులను పెను ప్రమాదంలోకి నెట్టేసింది. ఒక్కసారిగా కట్టలు తెంచుకున్న జలరాశి వారందరినీ మృత్యువాత పడేలా చేసింది. ఆ మరుసటి సంవత్సరం ఉత్తరకాశీ సొరంగం కూలిన ఘటనలో కార్మికులు క్షేమంగా తప్పించుకున్నారు. తాజా సొరంగ ప్రమాదం చోటు చేసుకున్నది కూడా అక్కడే. ఉత్తరాఖండ్‌లోనే 2021 ఫిబ్రవరిలో తపోవన్-విష్ణుగడ్ జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగం వందమంది కార్మికుల బ్రతుకుల్ని జలసమాధి చేసింది. అటువంటి భయానక విషాదం పునరావృతం కాకుండా జాతీయ విపత్తు నిభాయక దళం, చమురు సహజవాయు సంస్థ, రక్షణ పరిశోధన సంస్థ డీఆర్‌డీఓ, సట్లెజ్ జల విద్యుత్ నిగమ్ ఇత్యాది సంస్థలు రంగం లోకి దించారు. ఇందులో విదేశీ నిపుణులు సైతం,

మనదేశంలోని నిపుణులైన కూలీలు కూడా భాగస్వాములై శ్రామికుల ప్రాణాలు కాపాడటంలో విజయం సాధించారు. ఈ నేపథ్యంలో మనదేశం లో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 29 సొరంగాలకు సంబంధించి స్టేఫీ ఆడిట్ చేయించనున్నట్లు జాతీయ రహదారి సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ఇటీవలే ప్రకటించింది.

## సొరంగం చరిత్ర

సొరంగాన్ని ఆంగ్లంలో టన్నెల్ అంటారు. అనగా భూమి లోపల లేదా కొండలలో నిర్మించిన సన్నని మార్గము. కొన్ని సొరంగాలు రహదారుల కోసం నిర్మిస్తే, మరికొన్ని రైలు ప్రయాణాల కోసం నిర్మించినవి. ఢిల్లీ, కలకత్తా పట్టణాలలోని భూగర్భ రైలుమార్గాలు సొరంగాల లోపల నుండే నిర్మించారు. సొరంగాల పుట్టుక గురించి లోతుల్లోకి వెళితే దాదాపు 3000 సంవత్సరాల క్రితం మన పూర్వీకులు సొరంగాల వర్కింగ్ నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. బాబిలోనియాలో రాజ కుటుంబాలకు 900 మీటర్ల పొడవైన సొరంగం ద్వారా వారికి మంచినీటి పంపిణీ చేసేవారు. బాబిలోనియన్, పెర్షిన్ వాస్తుశిల్పులు, క్వాంట్, కరీజ్ పేర్లతో పిలిచే సొరంగాలను నీటిపారుదల కోసం ఉపయోగించేవారు. యుద్ధాలు సంభవించినప్పుడు రాజకుటుంబీకులు శత్రువుల బారి నుండి తప్పించుకునేందుకు రహస్య సొరంగ మార్గాలను తయారు చేయించుకునేవారు. రాజకోట ఉండి సుదూర ప్రాంతం వరకు ఇటువంటి సొరంగాలు త్రవ్వించడం వల్ల



గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడుకొని తప్పించుకోవడానికి ఈ సొరంగాలు ఉపయోగపడేవి. యూరోపియన్ మధ్య యుగాలలో, సొరంగాలు దాదాపుగా మైనింగ్, మిలటరీ కోసం ఉపయోగించారు. ప్రజారవాణా సుదూర ప్రాంతాల వారితో వ్యాపారాలు చేయడం ప్రారంభించిన పిదప 16 నుంచి 19 శతాబ్దాల మధ్య వందలాది చిన్న సొరంగాలను నిర్మించారు. రైలు, రవాణా వ్యవస్థ పెరిగిన పిదప ప్రపంచవ్యాపితంగా సొరంగాలు బాగా విస్తరించాయి. ఇటీవల జరుగుతున్న ఇజ్రాయేల్-గాజాకు చెందిన హమాస్ వారు చేస్తున్న యుద్ధంలో అనేక ఆశ్చర్యకరమైన విషయాలు బయటపడ్డాయి. గాజా నగరం అడుగుభాగంలో భూ ఉపరితనానికి 30 మీటర్ల లోతులో 500 కి.మీ. పొడవైన సొరంగమార్గాలు విస్తరించి ఉన్న విషయం ప్రపంచాన్ని ఆశ్చర్యచకితుల్ని చేసింది. ఈ సొరంగ మార్గాలలో జీపుల్లో సైతం ప్రయాణించవచ్చు. అంటే గాజా నగరం కింద భూగర్భ సొరంగాలలో మరో నగరం ఉందన్నమాట. యుద్ధాల సమయంలో తమను తాము కాపాడుకోవడానికి కొన్ని సంవత్సరాలపాటు హమాస్ వారు ఈ సొరంగాలను నిర్మించారు. హమాస్‌ను 24 గంటల్లో అంతం చేస్తామని ప్రకటించిన ఇజ్రాయెలు 40 రోజులుపైబడి వారితో యుద్ధం చేసినప్పటికీ విమానాలపై నుండి గాజా నగరంపై బాంబుల వర్షం కురిపించి అక్కడి భవనాలను కూల్చడం, అమాయకపు ప్రజలను చంపడం తప్పితే హమాస్‌ను అంతం చేయలేకపోయింది. కారణం వారు నిర్మించుకున్న భూగర్భ రంగాలే. ఏ సొరంగంలో ఎవరు ఉన్నారో? లేరో? ఎవరికీ తెలియదు. ఏ సొరంగం నుండి ఎవరు బయటకు వచ్చి నలుమూలలా చుట్టుముట్టి గొరిల్లా యుద్ధం చేసి అంతమొంది స్తారో? అనేది ఊహకు అందని విషయం. తరచూ యుద్ధాలను ఎదుర్కొనే చాలా దేశాలలో యుద్ధాల సమయంలో తమను తాము కాపాడుకోవడానికి భూగర్భ సొరంగాలు, బంకర్లు ప్రతి ఇళ్లల్లో నిర్మించుకుంటారు. దేశాధిపతులు తమ ప్రాణాలను కాపాడుకోవడా నికి భూగర్భంలో నివాసాలు ఏర్పరచుకుంటున్నారు.

## రహదారి సొరంగాలు

ప్రపంచంలోని అనేకదేశాలు తమ అవసరార్థం నిర్మిస్తున్న రహదారులకు అడ్డువచ్చిన కొండలను తొలిచి సొరంగాలు నిర్మించారు. నార్వేలోని లాయర్డల్ టన్నెల్ రవాణాతో పాటు ప్రయాణాలకు కూడా చాలా అనువుగా ఉంటుంది. ఈ రహదారి టన్నెల్ పొడవు 24.50 కి.మీ పొడవు ఉంటుంది. జపాన్‌లో ఉన్న యమటే టన్నెల్ రవాణా వ్యవస్థకు మైలురాయిగా నిలుస్తుంది. అనేక నగరాలను కలపడం ఈ టన్నెల విశిష్టత.

## రైలు సొరంగ మార్గాలు

ఇవి కాక ప్రపంచంలో అతి పొడవైన ఏడు సొరంగ మార్గాలు ఆసియా ఖండంలోనే ఉన్నాయి. వీటిలో నాలుగు జపాన్‌లోను రెండు చైనాలోను ఒకటి ఇంగ్లండ్‌తో పాటు యూరప్‌లో కూడా మరికొన్ని సొరంగ మార్గాలు ఉన్నాయి. జపాన్‌లోని సికాన్ టన్నెల్ 53.85 కి.మీ పొడవుతో అత్యంత పొడవైన రైలు సొరంగ మార్గంగా పేరొందింది. హక్కైడ్రై-హోన్షు దీవులను కలుపుతూ సుగరు జలసంధి గుండా వెళుతుంది. సముద్ర గర్భానికి దిగువన నిర్మించారు. సొరంగ మార్గాల ద్వారా రైలు ప్రయాణం చేస్తుంటే ఉత్సాహంతో పాటు భయం కూడా కలగక మానదు. ఇక సముద్ర అడుగుభాగాన 250 అడుగుల లోతులో 50.కి.మీ. సొరంగం త్రవ్వి ప్రయాణం చేయమంటే ఆ అనుభవం వర్ణనాతీతం. ఈ టన్నెల్ అధికారికంగా 1988లో ప్రారంభించారు. ఇంగ్లండ్-ఫ్రాన్స్ సరిహద్దులలో ఇంగ్లీషు ఛానల్‌లో ఉన్న ఈ టన్నెల్ పొడవు 50.5.కి.మీ. ఇది



ప్రపంచంలోనే అతి పొడవైన సముద్రగర్భ రైలు సొరంగం. ఇది యూకె కెంట్‌లోని ఫోక్‌స్టోన్-ఫ్రాన్స్‌లోని పాస్ డి కలైస్‌లోని కోక్వెల్స్‌తో కలుపుతుంది. దాదాపు ఆరేళ్లపాటు నిర్మించిన ఈ సొరంగమార్గాన్ని 1994లో ప్రారంభించారు. దీనికోసం 14.7 బిలియన్ డాలర్లను ఖర్చు చేశారు. ఈ నిర్మాణం ఇటీవల అంతర్జాతీయ సివిల్ ఇంజిరింగ్ కన్సల్టెంట్ల సమాఖ్య, ఎఫ్.ఐడి.ఐ.సి.చే గ్లోబల్ ఇంజినీరింగ్ సెంచరీ పురస్కారాన్ని అందుకుంది. ఇది యూ.కెలో 9.3 కి.మీ భూగర్భ సొరంగం, 38 కి.మీ.సముద్రగర్భ సొరంగం, ఫ్రాన్స్‌లో 3.2 కి.మీ. భూగర్భ సొరంగంతో సహా రెండు టెర్మినల్స్ మూడు సొరంగాల ద్వారా అనుసంధానించారు. ప్రపంచంలో మూడవ పొడవైన రైల్వే సొరంగంగా విరాజిల్లుతుంది. బ్రిటన్-ఫ్రాన్స్ మధ్య సముద్రం అడుగున ఇంగ్లీషు ఛానల్ దిగువన ఈ రెండు దేశాల మధ్య రవాణా కోసం ఏర్పాటు చేసిన సొరంగం ఇది. ప్రపంచంలో సముద్రం అడుగునుంచి వెళ్లే సముద్రమార్గంలో ఇదే అతి పెద్దది. దీని నిర్మాణానికి 13వేల మంది కార్మికులు పనిచేశారు. మానవ మేధస్సుకు, ఇంజినీర్ల ప్రతిభకు ఈ సొరంగ నిర్మాణం తార్కాణమని చెప్పవచ్చు. వేలాది ఏళ్ల క్రితం చివరి మంచుయుగం ముగుస్తున్న కాలానికి భూఫలకాలలో కదలికలొచ్చి గ్లేసియర్స్ జరిగి ఐరోపా భూభాగం నుండి నేటి ఇంగ్లండ్ విడిపోయి దూరం జరిగింది. రెండింటి మధ్య ఏర్పడిన సముద్ర భాగాన్నే ఇంగ్లీషు ఛానల్ అని పిలుస్తున్నారు.


అటల్ టన్నెల్

స్విట్జర్లాండ్‌లోని ఆల్ప్స్ పర్వతాల గుండా నిర్మించిన లోట్ష్‌బర్గ్ బేస్ టన్నెల్. దీని పొడవు 34.6 కి.మీ. ఈ టన్నెల్ గుండా రైళ్లు గంటకు 250 కి.మీ. వేగంతో పరుగులు తీస్తాయి. ప్రయాణీకుల రైళ్లతో పాటు సరుకురవాణా గూడ్స్‌లు కూడా ఈ మార్గంలో తిరుగుతాయి. స్పెయిన్‌లోని గ్వాడర్రామ రైల్ టన్నెల్ ప్రపంచంలోని నాల్గవ పొడవైన సొరంగం. స్పెయిన్‌లో అతి పొడవైన సొరంగంగా పేర్కొన్న ట్విన్-ట్యూబ్ రైలు సొరంగం, మాడ్రిడ్-వల్లాడోలిడ్ మధ్య అత్యంత వేగంగా నడిచే రైలు కోసం 28.4 కి.మీ. సొరంగాన్ని సియోర్రా డి గ్వాడర్రామా పర్వత శ్రేణి ద్వారా తొలిచి నిర్మించారు. ఈ రెండు సొరంగాలు సమాంతరంగా 30 కి.మీ.దూరంలో ఉన్నాయి. చైనాలోని తైహాంగ్ పర్వతాలలో ఉన్న తైహాంగ్ టన్నెల్ ప్రపంచంలో అయిదవ పొడవైన రైల్వే సొరంగంగా ప్రసిద్ధి చెందింది. తైహాంగ్ పర్వతాలను దాటడానికి షిజియాజువాంగ్-తైయువాన్ రైల్వే ప్రాజెక్ట్‌లో భాగంగా 27.8 కి.మీ. పొడవున్న జంట ట్యూబ్ సొరంగాన్ని 2007లో నిర్మించారు. జపాన్‌లోని హక్కోడా టన్నెల్ 26.45 కి.మీ పొడవుతో జపాన్‌లో పొడవైన భూ-ఆధారిత డబుల్ ట్రాక్ రైల్వే సొరంగంగా పేరొంది ప్రపంచంలోనే ఆరవ పొడవైన సొరంగంగా ప్రసిద్ధి చెందింది. జపాన్ నందున్న అమోరి ప్రిఫెక్చర్‌లోని బెన్మబయాషి-మురా నుండి అమోరి సిటీల మధ్య హక్కోడా పర్వతం ఉత్తర చివరలో ఉంది. ఈ టన్నెల్ నిర్మాణం ఆగస్టు 1998లో ప్రారంభమై ఫిబ్రరి 2005లో పూర్తయింది. జపాన్‌లోని ఇవాట్-ఇచినోహె సొరంగం ప్రపంచంలోని అత్యంత పొడవైన ఏడవ రైల్వే సొరంగంగా పేరొందింది.

## భారతదేశంలో పొడవైన సొరంగాలు

కొన్ని సొరంగ మార్గాలు రైలు ప్రయాణాల కోసం నిర్మించుకుంటే, మరికొన్ని రహదారుల గుండా వాహన ప్రయాణాల కోసం నిర్మించారు. అటువంటి వాటిలో మన దేశంలో నిర్మించిన అటల్ సొరంగ మార్గం ఒకటి.

## అటల్ సొరంగ మార్గం

భారతదేశంలోనే కాక ప్రపంచంలోనే అతి పెద్ద సొరంగ రహదారి మార్గాలలో ఒకటి అటల్ టన్నెల్. మనాలి నుంచి లేహ్ వరకు 9.2 కి.మీ. ఉన్న ఈ సొరంగ రహదారి భూమికి పది వేల అడుగుల ఎత్తులో నిర్మించారు. సొరంగం వెడల్పు 10.5 మీటర్లు ఉంటుంది. ఆరేళ్లలో దీన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ పదేళ్లు పట్టింది. లేహ్ నుండి మనాలి 472 కి.మీ. ఉండగా ఈ రహదారి వల్ల 46 కి.మీ. దూరం తగ్గుతుంది. దీంతో పాటు ప్రయాణ సమయంలో నాలుగు గంటలు కలిసి వస్తుంది. 9.2 కి.మీ. పొడవైన ఈ టన్నెల్‌లో ప్రతి 60 మీటర్లకు ఒక సీసీ కెమెరాను బిగించారు. వీటితో పాటు ప్రతి 500 మీటర్లకు ఒకచోట అత్యవసర ద్వారం, అగ్ని ప్రమాదాలను నివారించడానికి సొరంగ మార్గమంతా అగ్నిమాపక వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీనిని గతంలో రోహతాంగ్ టన్నెల్‌గా పిలిచేవారు. తరువాత భారత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి పేరు పెట్టారు. అటల్ బిహారీ వాజపేయి భారత ప్రధానిగా ఉన్న సమయంలో ఈ ప్రతిష్టాత్మక సొరంగ మార్గం నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నారు. అటల్ టన్నెల్ పూర్తి చేయడానికి పదేళ్ల కాలం పట్టింది. 2020లో ఈ సొరంగ రహదారిని ప్రారంభించారు. అటల్ టన్నెల్ సముద్ర మట్టానికి 3,100 మీటర్ల ఎత్తులో ఉండగా, రోహతాంగ్ కనుమ 3,978 మీటర్ల ఎత్తులో ఉంది. భారతదేశంలో అనేక పొడవైన రైల్వే టన్నెల్స్ ఉన్నాయి. హిమాలయ పర్వత శ్రేణుల మధ్యలో నెలకొని ఉన్న పీర్ పంజాల్ రైల్వే టన్నెల్ భారతదేశంలో అతి పొడవైన రైలు సొరంగం. ఇది 11.2 కి.మీ. పొడవు ఉంటుంది. ఇది 119 కి.మీ. జమ్మూ- బారాముల్లా లైన్‌లో భాగం. ఈ టన్నెల్ నిర్మాణం వల్ల క్వాజి గుండ్- బనిహాల్ ప్రాంతాల మధ్య దూరం 11 కి.మీ. తగ్గించింది. కేరళలోని త్రివేండ్రం పోర్ట్ టన్నెల్ 9.02 పొడవున నిర్మించారు. భారతదేశంలో రెండవ పొడవైన రైలు సొరంగం. భారతదేశంలో మూడవ పొడవైన రైల్వే టన్నెల్ కత్రా-బనిహాల్ మధ్యన నిర్మించిన సంగల్దాన్ రైల్వే టన్నెల్ 7.1 కి.మీ. పొడవు ఉంటుంది. కొంకణ్ రైల్వే కార్పొరేషన్ దీనిని డిసెంబరు 2010లో నిర్మించింది.

గుర్రపు డెక్క ఆకారంలో ఇండియన్ రైల్వేస్ రాపురు(పి–4) పొడవైన విద్యుద్దీకరిం చిన సొరంగం. 6.6 కి.మీ పొడవైన ఈ సొరంగం కేవలం 43 నెలల తక్కువ సమయంలో నిర్మించి రికార్డు సృష్టించారు. మహారాష్ట్రలోని ఉక్షి–భోకే రైల్వే స్టేషన్‌లను కలుపుతూ కర్బుదే(టి–35) సొరంగాన్ని 6.5 కి.మీ. పొడవున నిర్మించి 1997లో ప్రారంభించారు. ఇది కొంకణ్ రైల్వేస్‌లో అతి పొడవైన, ప్రముఖమైన రైల్వే సొరంగాలలో ఒకటి. ఒడిశాలోని మాలిగూడ టన్నెల్ 4.4 కి.మీ. పొడవైన భారతీయ రైల్వే సొరంగం. ఈ సొరంగం ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్‌లో ఉంది. దీన్ని 1963లో ప్రారంభించారు.

## అందరికీ తెలియని రహస్య సొరంగాలు

మన దేశంలో రాజులు నిర్మించిన అనేక కోటలు, చారిత్రక కట్టడాలు, ఆలయాలలో రహస్య సొరంగాలు ఉన్నాయి. బ్రిటిషువారు సైతం కొన్ని భూగర్భ సొరంగాలను నిర్మించిన ఆధారాలున్నాయి. చాలా సొరంగాల రహస్యాలను మనవారు ఛేదించారు. కొన్ని సొరంగాలు కనిపించినప్పటికీ ఆది ఏది, అంతం ఏదని కనుగొనలేకపోయారు. నీటి పైపులు, టెలిఫోన్ పైపులు ఏర్పాటు చేస్తున్న సందర్భాలలో జరిగిన రహదారుల తవ్వకాలలో అనేక సొరంగాలు బయట పడ్డ సందర్భాలు ఉన్నాయి. సొరంగాలు వారసత్వ ప్రేమికులకు గొప్ప నిధిగా ఉపయోగపడతాయి. కొన్ని సొరంగాల నిర్మాణం వెనుక ఉన్న వాస్తవిక కారణాలు మనకు ఎప్పటికీ తెలియకపోవచ్చు. పురావస్తు శాస్త్రవేత్తలు, చరిత్రకారుల అధ్యయనాలలో కొన్ని విషయాలు వెల్లడి అవుతుంటాయి. వీటిని కొందరు నమ్మితే, మరికొందరు తోసిపుచ్చుతుంటారు.

## గోల్కొండలో రహస్య సొరంగం

మొఘలుల పాలన కారణగా హైదరాబాద్ నగరానికి ప్రత్యేకమైన చారిత్రక ప్రాధాన్యత ఉంది. మొఘలులు నేటికీ పర్యాటకులను ఆకర్షిస్తున్న కంటికి ఆకట్టుకునే శిల్పకళతో ఐకానిక్ స్మారక కట్టడాలను నిర్మించారు. చారిత్రాత్మక గోల్కొండ కోట నుండి చార్మినార్ వరకు 9 కి.మీ. పొడవైన రహస్య సొరంగ మార్గం ఉందనే కథనాలు ఉన్నాయి. ఒక సందర్భంలో గోషామహల్ వద్ద నీటి పైప్ లైన్ల కోసం తవ్వకాలు జరపగా ఒక సొరంగ మార్గం బయట పడింది. ఇవన్నీ ఊహాగానాలే అనేవారు కూడా లేకపోలేదు. హైదరాబాద్ పాతబస్తీ స్థానికులు ఈ సొరంగ మార్గం ఉందని ప్రగాఢంగా విశ్వసిస్తారు. గోల్కొండలో ఉన్న సొరంగ మార్గాన్ని మూసివేశారు. ఆ దారి ఎక్కడివరకు వెళుతుందనేది ఎవరూ కనిపెట్టలేకపోయారు. పర్యాటకులు గోల్కొండను చూడటానికి వెళ్లినప్పుడు ఆ సొరంగం చూపించే మిషతో వారిని లోపలకు తీసుకుని వెళ్లి, వారి వద్ద ఉన్న సొమ్మును దోచుకుని, హత్య చేసిన ఉదంతాలు కూడా ఉన్నాయి. ఆ కారణంగా ఈ సొరంగ మార్గాన్ని దశాబ్దాల కాలం క్రితమే మూసేశారు. మూసివేసిన ఆనవాళ్ల ను నేటికీ పర్యాటకులు తిలకించవచ్చు.



హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో మరో సొరంగం 2023 ఏప్రిల్‌లో బయట పడింది. ముషక్ మహల్‌లో ఈ సొరంగం వెలుగులోకి వచ్చింది. ముషక్ మహల్ కులీకుతుబ్ షాహీ కాలం నాటిది. ఈ సొరంగంలో వేర్వేరు వైపుల నుంచి దారులు ఉన్నాయి. పురావస్త శాఖవారు ఈ సొరంగానికి సంబంధించిన వివరాలు తెలుసుకోవడానికి రంగంలోకి దిగారు.

## అమృత్‌సర్‌లో సొరంగాలు

పంజాబ్ రాజధాని అమృత్‌సర్ నగరంలో కొన్ని సొరంగాలు 400 సంవత్సరాల నాటివిగా గుర్తించారు. తవారిఖ్ లాహోర్–అమృత్‌సర్ అనే పుస్తకంలో ఇక్కడున్న రెండు డజన్లకు పైగా సొరంగాల ఉనికి గురించి ప్రస్తావన ఉంది. 1990లో కత్రా భాగియాన్‌లోని ఒక సొరంగం ఒక భవనం లోపల ఉన్నట్లు కనుగొన్నారు. అయితే దీన్ని కూల్చి వేయాలని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆదేశించింది. అదే విధంగా 2006లో 5.5 అడుగుల వెడల్పు సొరంగాన్ని గుర్తించిన స్థానికులు సిమెంటుతో నింపారు. గురు హరగోవింద్ సాహిబ్ తప్పించుకోవడానికి వీలుగా నిర్మించిన సొరంగాన్ని కనుగొన్నారు. ఇది అతని కోట నుండి స్వర్ణ దేవాలయం వరకు ఉన్నట్లు చెబుతారు. కానీ పూర్తి స్థాయిలో అన్వేషణ కొనసాగలేదు. చరిత్ర లో ప్రస్తావన ఉన్నప్పటికీ ఇంకా కొన్ని చారిత్రక ప్రాముఖ్యత కలిగిన సొరంగాలు ఇప్పటికీ గుర్తించలేకపోయారు.

## ముంబైలో సొరంగాలు

ముంబైలోని జనరల్ పోస్ట్ ఆఫీస్ భవనంలోని తోటలో పాత సొరంగాన్ని కనుగొన్నారు. ఈ సొరంగంలో ఎటువంటి దుర్వాసన లేని కారణంగా ఇది డ్రైనేజీ వ్యవస్థ కాదని నిరూపితమైంది. ఈ సొరంగంలో తుప్పు పట్టిన నిచ్చెన కూడా ఉంది. బహుశా బ్రిటిషువారు దీని నిర్మించారని భావిస్తున్నారు. ఇదే రీతిలో ముంబైలోని సెయింట్ జార్జెస్ ఆసుపత్రిలో 1.5 కి.మీ. పొడవైన సొరంగం బయట పడింది. ఈ సొరంగం గేట్ వే ఆఫ్ ఇండియా, బ్లూ గేట్, చర్చ్‌గేట్‌లకు అనుసంధానించి ఉన్నట్లు తెలిసింది. యుద్ధ సమయాలలో తప్పించుకునే మార్గం అని కొందరు భావిస్తే, సైనికులు మందుగుండు సామాగ్రిని తరలించడానికి ఉపయోగించి ఉంటారని మరికొందరి అభిప్రాయం. ఈ భూగర్భం సొరంగం సముద్రపు నీరు, బురదతో నిండి వుండటంతో కొన్ని మీటర్లను మించి లోపలికి వెళ్లడం కష్టం. అందువల్ల దీనికి సంబంధించి ఇంకా చాలా విషయాలు తెలియవలసి ఉంది.

## అంబర్ ప్యాలెస్ సొరంగం

రాజస్థాన్‌లోని జైపూర్‌లో అంబర్ ప్యాలెస్ ఉంది. ఈ కోటలో ఉన్న ఒక సొరంగం ప్రధాన నగరాన్ని కలుపుతుంది. పర్యాటకులను ఆకర్షించడానికి 2011 నుండి

ఈ సొరంగాన్ని తిలకించే అవకాశం కల్పించారు. శత్రువులు దాడి చేసినప్పుడు గత్యంతరం లేని పరిస్థితిలో రాజ కుటుంబీ కులు తప్పించుకునేందుకు 18వ శతాబ్దం లో ఈ సొరంగ మార్గాన్ని నిర్మించారు.

**శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయం**

కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో శ్రీ అనంత పద్మనాభస్వామి దేవాలయం అత్యంత ప్రసిద్ధ పర్యాటక ప్రదేశం. ఈ ఆలయంలో నేల మాళిగలుగా పిలిచే ఆరు సొరంగాలు ఉన్నాయి. వీటిలో 22 బిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని కనుగొనడం భారతీయ చరిత్ర రహస్యాలలో ఒకటి. ఖజానాలలో బంగారు ఏనుగులు, నగలు, విగ్రహాలు దాచారు. ఒక సొరంగం ఇప్పటికీ తెరవలేదు. దాన్ని తెరిస్తే ప్రకృతి వైపరీత్యాలు వస్తాయని ప్రజలు విశ్వసిస్తున్న కారణంగా అందులో ఏముందనేది ఇప్పటికీ మిస్టరీగానే మిగిలింది.

**ఢిల్లీ శాసనసభ సొరంగం**

ఢిల్లీ శాసన సభలో రహస్య భూగర్భ సొరంగాలలో ఒకటిగా ఉందనే వాదన ఉంది. ఇది ఎర్రకోటకు అనుసంధానిం చబడినందున ఇది గొప్ప చారిత్రక ప్రాముఖ్యత కలిగిన సొరంగంగా భావి స్తుంటారు. భారత ప్రభుత్వం అటువంటి సొరంగం ఉనికి గురించి తమకు తెలుసు నని పేర్కొన్న సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే దాన్ని తెరవలేదు. రహస్యంగానే మిగిలిపోయింది. ఈ రహస్య సొరంగం బ్రిటిష్ కాలం నాటి చరిత్రను తెలియజేస్తుంది. నేటికీ ఇది సమాధానం లేని ప్రశ్నగానే మిగిలిపోయింది.




## అసోంలోని తలతల్ ఘర్

అస్సోంలోని తలతల్ ఘర్‌లో ఆర్మీ బేస్‌ను 18వ శతాబ్దంలో రెండు భూగర్భ సొరంగాలతో నిర్మించారు. సొరంగాలు యుద్ధాల సమయంలో రాజుల కోసం ఇందులో ప్రత్యేకంగా తప్పించుకునే మార్గాలను రూపొందించాయి. 3 కి.మీ. పొడవైన సొరంగం ధికో నదికి అనుసం ధానించబడి ఉంది. 16 కి.మీ. సొరంగం నేరుగా గర్హగావ్ ప్యాలెస్‌కి తప్పించుకునే మార్గం. సొరంగాలు నేల మట్టం సర్వేలో రహస్య సొరంగం లేదని నివేదికలు వెల్లడయ్యాయి. ఈ విషయమై తుది నిర్ణయం రాలేదు.

**కోల్‌కతాలోని జాతీయ గ్రంథాలయంలో..**

కోల్‌కతాలోని జాతీయ గ్రంథాలయానికి శతాబ్దాల చరిత్ర ఉంది. బెంగాల్ నవాబు నిర్మించిన ఈ లైబ్రరీ దేశ వ్యాప్తంగా ఉన్న పురావస్తు శాస్త్రవేత్తలను ఆకర్షించింది. ఇందులోని ఒక గదిలో రహస్య సొరంగ మార్గం ఉందని కథలు జోరుగా ప్రచారంలోకి వచ్చాయి. బ్రిటిషువారు తప్పించుకునే మార్గగా ఈ సొరంగాన్ని నిర్మించి వుండవచ్చు. పూర్తి స్థాయి విషయం వెలుగు చూడలేదు.ఇప్పుడు కాశ్మీర్ అధునాతన సౌకర్యాలతో పర్యాటకుల స్వర్గధామంగా మారనుంది. శ్రీనగర్, లద్దాఖ్‌ల మధ్య దూరాన్ని తగ్గించే ఆలోచనలతో ఆసియాలోనే అతి పెద్దదైన జోజిలా టన్నెల్ ఏర్పాటు చేయబోతున్నారు. కేంద్రపాలిత ప్రాంతాలుగా మారిన కాశ్మీర్, లద్దాఖ్‌ల మధ్య రవాణాను సులభతరం చేయడానికి ఇది ఎంతో దోహదపడుతుంది. ఇటువంటి సొరంగాలే



కాక పెద్ద డ్యామ్‌లు నిర్మించేటప్పుడు నీటి ప్రవాహం కోసం అతి పెద్ద టన్నెల్స్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ సొరంగ మార్గాల ద్వారా నీరు బయటకు వచ్చే ఏర్పాటు చేస్తారు. కొన్ని సొరంగాలు ప్రజలకు మేలు జరగాలని మంచి కోసం నిర్మిస్తే, మరికొన్ని స్వార్థంతో, ధన సంపాదనే ధ్యేయంగా చెడు కోసం తయారు చేసుకుంటున్నారు. మంచి కోసం నిర్మిస్తే వికాసం, చెడు పనులకు వినియోగిస్తే వినాశనమే అనేది సర్వవిదితమే. చాలావరకు సొరంగాలు ప్రజలకు మేలు చేస్తున్నాయి. వీటి వల్ల నగరాల మధ్య దూరం తగ్గుతుంది. ఆ కారణంగా సరుకు రవాణా, ప్రయాణ సమయం సులువవుతుంది. ఎటువంటి ప్రమాదాలు వాటిల్లకుండా వీటిని జాగ్రత్తగా మానవ కళ్యాణానికి ఉపయోగిస్తే ప్రజలకు ఎకువ మేలు జరుగుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

ఎన్నో టన్నెల్స్ ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయి. కొన్ని బొగ్గుగనులకు సంబంధించినవి అయితే మరికొన్ని ఇతర టన్నెల్స్. ఏ టన్నెల్స్‌లో అయినా పనిచేసే కార్మికుల భద్రత ముఖ్యం. వారి భద్రతకు తగిన ఏర్పాటు చేయడం సంబంధిత అధికారుల బాధ్యత. ఉత్తరకాశీలో కార్మికులు ప్రాణాలతో బయటపడేందుకు 17రోజులు పట్టింది. అదృష్టవశాత్తు వారు ప్రాణాలతో బయటపడ్డారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే టన్నెల్‌లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి ముందుగా తగిన జాగ్రత్తలు తీసుకున్న తర్వాతే పనులు మొదలుపెట్టాలి. ❑

# లీటర్ నూనె రూ.20వేలు



ఏ పంట వేసినా వాటి పువ్వులో కాయలో రైతుకు ఆదాయాన్ని తెచ్చి పెడుతుంటాయి. అవేమీ లేకపోయినా..వేసిన మూడునెలలకే కాసులు కురిపిస్తుంది జెరేనియం. రైతుల పాలిట కల్పవృక్షమైన దీని ఆకులూ, కాండం నుంచి వచ్చే నూనె ధర మార్కెట్‌లో వేల నుంచి ఇరవై వేలదాకా పలుకుతోంది. విదేశాల్లోనే సాగయ్యే ఈ పరిమళ పంట ఇప్పుడు మన దగ్గర కూడా పండుతోంది. లావెండర్, రోజ్, రోజ్‌మేరీ, చామంతి, పెప్పర్‌మింట్ వంటి రకరకాల ఎసెన్షియల్ నూనెలు మనకు తెలిసినవే. మొక్కల నుంచి తీసే పరిమళ నూనె జెరేనియం కూడా అలాంటిదే. ఇండోనేషియా, ఈజిప్టు, చైనాలో విరివిగా సాగయ్యే ఈ నూనెను ఔషధాలూ, సౌందర్యోత్పత్తులూ, పెర్‌ఫ్యూమ్‌ల తయారీలోను, స్పాల్లోనూ ఉపయోగిస్తారు. మనదేశంలోని చాలా పార్మా, కాస్మెటిక్స్ సంస్థలు ఈ సుగంధాల నూనెల ఈజిప్టు నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి. పలు రంగాల్లో డిమాండ్ ఉండటంతో దీని ధర లీటరు పన్నెండు వేల నుంచి ఇరవై వేల దాకా పలుకుతోంది. అందుకే ఈ సాటు పట్ల రైతులు ఆకర్షితులవుతున్నారు. గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణలో జహీరాబాద్ వంటి చోట్ల ఇప్పటికే సాగు చేస్తున్నారు.




## పెరుగుతున్న ఆదాయం

జెరేనియం పంట వేసిన మూడునెలలకు గుబురుగా పెరుగుతుంది. కొమ్మలన్నీ వేరు చేసి బాయిలర్లలో వేసి ఆవిరి మీద ఉడికించి నూనె తీస్తారు. దాదాపు టన్ను మొక్కల నుంచి లీటరు నూనె వస్తుంది. ఎకరానికి సుమారు పదహారు లీటర్ల నూనెను ఉత్పత్తి చేయొచ్చు. ఏడాదికి నాలుగుసార్లు పంటను కోసి నూనెను సేకరిస్తారు. చాలామంది రైతులు సంఘాలుగా ఏర్పడి ఈ తరహా పంటల్ని పండిస్తున్నారు. వీటితోపాటు నూనె తీసే యంత్రాల్ని కూడా ఏర్పాటు చేసుకుని ఫారాన, కాస్మెటిక్స్ సంస్థలకు లాభాలకు విక్రయిస్తున్నారు. మరికొందరైతే నూనె తీసుకునే విధంగా పలు సంస్థలతో ముందే ఒప్పందం చేసుకుని అప్పుడు సాగు చేస్తున్నారు. కోతకోతకీ దిగుబడి పెరగడం జెరేనియం ప్రత్యేకత. కరవు ప్రాంతాల్లో సైతం సాగు చేయగలిగిన ఈ పంటకు తెలుగు రాష్ట్రాల్లోని వాతావరణం ఎంతో అనుకూలం. నెలకి రెండుసార్లు నీళ్లు పెట్టినా సరిపోతుంది. చీడల బెడద కూడా తక్కువే. మెడిసినల్ ప్లాంట్ కాబట్టి రసాయనాల జోలికి పోకుండా సేంద్రియ ఎరువుల్నే వాడుతుంటారు రైతులు. మరి సాగు చేయాలనే ఆసక్తి ఉన్నవారు ఈ మొక్కల్ని తెచ్చి నాటడం ఎలా అనుకుంటున్నారా? లఖ్‌నవూలో ఉన్న కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సీఎస్ఐఆర్‌న సీఐఎమ్ఏపీని సంప్రదిస్తే ఈ మొక్కలను 'అరోమా మిషన్'లో భాగంగా అందిస్తారు. రైతుల్ని ప్రోత్సహించాలని సాగు విధానంలో శిక్షణ కూడా ఇస్తున్నారు. ఇక సాగులోకి ఇగినవారేమో ఈ మొక్కల పక్కన పాదులో వచ్చే కొత్తవాటిఓ నర్సరీ ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇలా ఎన్నో రకాలుగా రైతులకు సిరులు కురిపిస్తున్న జెరేనియం నూనెతో ఉన్న ఉపయోగాలు అన్నీ ఇన్నీ కావు. గులాబీ పరిమళాన్ని పోలిన సువాసనను వెదజల్లే జెరేనియం ఒత్తిడినీ, యాంగ్జైటీనీ దూరం చేస్తుంది. అందుకే అరోమా థెరపీలో మర్దనలకు ఈ నూనెనే ఎంచుకుంటారు. ఇంకా కళ్లకింద మచ్చల్నీ, మొటిమల్నీ తగ్గించి చర్మాన్ని బిగుతుగా చేయడంతోపాటు ఎన్నో రకాల సమస్యల్ని దూరంగా ఉంచుతుంది. ఇంకా మరెన్నో సుగుణాలున్న ఈ జెరేనియం దోమల్ని తరిమేసి, కాలుష్యాన్ని తగ్గిస్తుంది. అందుకే దీన్ని ఇండోర్ ప్లాంట్‌గానూ ఎంచుకుంటున్నారు చాలామంది. తక్కువ పెట్టుబడితో పెద్దగా శ్రమ లేకుండా ఎక్కువ ఆదాయాన్ని తెచ్చిపెట్టే జెరేనియం రైతులకు నిజంగా ప్రకృతి వరప్రసాదమే.



# ఈవారం కవిత్వం



## గాడి తప్పనివ్వకు

తడబడుతున్న అడుగుల్తో
నీ దరి చేరానని నీకు అలుసైనానేమో... కానీ!
హృదయాంతరాల్లో
దాగిన నీపై నా ప్రేమ తడబడలేదు.
అందుకేనేమో నాకు కన్నీరు మిగిలింది.
నీ చేయి అందుకున్న రోజే/ నా మనసుకు మాటిచ్చేసా
కష్టం, సుఖం, సంతోషం, దుఃఖం
నీతోనే పంచుకుంటానని, నీ చేతిని విడువనని.
మనసు ముక్కలౌతున్నా/ ఇచ్చిన మాటకు కట్టుబడి
నీ నిరాదరణకు తలొగ్గి
నీ ఆదరణ కోసం పరితపిస్తున్నా!
గడిచిన కాలంలో/ ప్రతి క్షణం నీ జ్ఞాపకాలే
నేడు అవే నన్ను వెంటాడుతున్నాయి.
కంటికి నిద్దుర దూరం చేస్తున్నాయ్.
జీవన గమనంలో
చెరో దిశగా అడుగులు వేస్తున్నా.
నీ అడుగులు
వెనుతిరిగి నన్ను చేరాలనే ఆశ
నేటికీ సజీవంగానే ఉంది నేస్తం.
ఒక్కసారి ప్రయత్నించి చూడు
నూరేళ్ల జీవితం గాడి తప్పనివ్వకు.

**- రాము కోలా**

## నిజాలకు లొంగుతారు

**రోజూ** మాట్లాడుకుంటారు
లక్షల పదాలను కోసుకుని
గంటల కొలదీ నెమరేసుకుంటూ
అర్థాలను ప్రేమించుకుంటారు.
ఇష్టాల దప్పిక తీరేలా
కోరికలను పిలుచుకుని
కొత్త రుచులతో
మనసు ఆకలిని తీర్చుకుంటారు.
ఒకరి అందాన్ని మరొకరు
రెట్టింపు చూపుతూ పొగుడుకుంటూ
నిలువెత్తు నిజాలతో
హృదయంలో నాటుకుంటారు.
ఒంటరితనం వెంటపడితే
రహస్య లోతుకెళ్లి
నులివెచ్చని జ్ఞాపకాలను
తీయగా తలచుకుంటారు.
కాలాన్ని తమకి తగినట్లు మలిచేలా
సమయ సందర్భాలకు ఒదిగి
ఒకరి కళ్లతో మరొకరిని చూస్తూ
రోజులని నిండుగా నింపుకుంటారు.
రోజూ ఒకరికి ఒకరు ప్రతిబింబంగా
మనసులు ప్రతిరూపాలుగా
చిన్న మాటకే చెదిరిపోతుంటారు
తిరిగి లోతు నిజాలకు లొంగి
ఒకటౌతారు.

**- సుభాషిణి వడ్డెబోయిన**

## రాగ రమ్య

**అనురాగమే** వసంతమై
అనుబంధమే కోకిల రాగాలయి
కురిసే ప్రతి చినుకు/ ఎదలో పొంగేనో..
వసంత రాగాల
నృత్యగాన సమ్మేళనం.
రాగరమ్య అభిమాన సిరులు
ఆకుపచ్చని ప్రకృతి ఒడిలో
కలల కన్నీటిలో అలల కళలయి
జల జలమని రాలెనో../ తొలకరి పద నిసలయి
విరిసే పెదవుల దరహాసం
జీవన సోపానపు సంగీత మాధుర్యం
రేపటి ఆశకు ఊపిరి అంకురం
పోరాడే శ్రమ జీవుల ఆశయం
నిత్యం హరివిల్లుల సూర్యోదయం
అవుతుంది నిరాశ చీకట్లను
పారద్రోలే నక్షత్ర క్రాంతి.

**- రవీందర్ కొండా**






## అన్నమయ్య పద కవితా వైభవం

ఆంధ్రపద కవితా పితామహులు శ్రీతాళ్లపాక అన్నమయ్య. వీరు వేంకటేశ్వర వైభవాన్ని 32 వేల సంకీర్తనలతో స్తుతించినారని లొగడ తిరుపతి తిరుమల దేవస్థానము వారు రాగిరేకులు కాగితపు ప్రతులు మున్నగు వాటిని శోధించి 289 సంకీర్తనలను వెలికి తెచ్చినారు. ఇందుకు కొనసాగింపుగా, తంజావూరు సరస్వతీ మహలు వారి తాళపత్ర గ్రంథాలయ విభాగంలో శ్రీవేంకటేశ పదముగా లభ్యమైన మరి 89 సంకీర్తనల సమాహారమిది. డా॥వేటూరి ఆనందమూర్తి, గంధం బసవ శంకరరావు, పద్మభూషణ్ డా॥కె.ఐ.వరప్రసాదరెడ్డి (శాంతా బయోటెక్)ల సంపాదకత్వంలో తిరుపతి తిరుమల దేవస్థానమువారు ప్రచురించినారు. పదసృజన, స్వరరచన రెంటినీ సమన్వయం చేస్తూ రచించిన వారిని వాగ్గేయకారులు అంటారు. ఆవిధంగా అన్నమయ్య తెలుగువారికి లభించిన గొప్ప భాగ్యం. 1940లో సర్వశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి, తాళ్లపల్లి ఆనంతకృష్ణశర్మ, వేటూరి ఆనందమూర్తిల శోధనలతో అన్నమయ్య కీర్తనలు మొట్టమొదటిసారిగా ప్రాచుర్యములోనికి వచ్చినవి. ఇది ఆ ప్రయత్నమునకు కొనసాగింపు. అన్నమయ్య శ్రీవేంకటేశుని, ఒక భక్తుడిగా, ప్రియునారాధించే ప్రేయసిగా, ఎన్నో విధముల తానై భగవంతుని సేవించినాడు. మరుగున పడిన మాణక్యముల వంటి అన్నమయ్య కీర్తనలను తెలుగు వారలకందించు ఈ ప్రయత్నమునకు టిటిడి, సంపాదకులు ఎంతయో అభినందనీయులు. **(శ్రీవేంకటేశపదములు, సంపాదకత్వం డా॥ వేటూరి ఆనందమూర్తి, వెల: రూ 85, ప్రతులకు: కార్యనిర్వహణాధికారి, తి.తి.దే, తిరుపతి)** **– కూర చిదంబరం**

## బాలల గేయాల్లో 'మిస్సైల్ మ్యాన్'



ముప్పైరోజులూ పిల్లలు గేయాలు పాడుకొనేటట్లుగా ఈగేయాలు రాసారు కవి. బాలగాంధీ/ పలుకులమ్మ/ గాలిపటము/ రైతుపండుగ/ సద్దిమూట/ అమ్మ–బడి–వెండి వెన్నెల–జాబిల్లి–పలక–అఆలు–పంచాంగం ముద్దుముద్దుల మాటలు–మిస్సైల్ మ్యాన్–బుద్ధిమంతులు, పాటలు పిల్లల్ని ఎంతో అరిస్తాయి. ఈ పుస్తకంలోని చాలాగేయాలు వార్త దినపత్రికల్ల 'మొగ్గ'లో ప్రచురణై పాఠకాదరణ పొందినవే. 'జనమే తన ఆస్తి అండి/ రచనలెన్నోచేసెనండి/ ప్రపంచాన వెలిగెనండి' (పేజీ.5) అంటారు మిస్సైల్ మ్యాన్ గేయంలో. 'తెలుగుభాషె భూషణమై/ వెలుగులీనె వేడుకచూడ/ పృథ్విలోని తెలుగువారు/ పులకరించి ఆడిపాడిరి' అంటారు తెలుగు వెలుగు గేయంలో..(పేజీ.59). పాఠాలు, పద్యాలు చదివిన బాలలు/ గాలిపటమెగరేసి ఆనందమందేరు/ దారమాధారం గాలిపటానికి/ విద్య ఆధారము భావిపౌరులకు (పేజీ.17). బాలప్రభలోని కథ/ భవితను దిద్దే కథ, గురువులు చెప్పే కథ/ బుద్ధిమాటల కథ/ వినండీ కథల కథ (పేజీ.41) అంటూ రాసిన ఈ బాలల గేయాలు 'గేయయోగ్యంగా ఉన్నాయి. **(మిస్సైల్ మ్యాన్, రచన: ఎన్నవెల్లి రాజమౌళి, వెల: రూ 80, ప్రతులకు: ఎ.రాజమౌళి, తడకపల్లి, సిద్ధిపేట502114)**

**– తంగిరాల చక్రవర్తి**

**పుస్తక సమీక్ష**

## ఎమ్వీయల్ హాస్య రచన 'అధిక ప్రసంగం'

తెలుగునాట 'ముత్యాలముగ్గు' అద్భుత చలనచిత్రకళాఖండ నిర్మాతగా, శాశ్వత స్మరణీయత పొందిన 'ఎమ్వీయల్' కవితా సంకలనాలు, నాటకాలు, నవలలు, పరిశోధనలు, సంపాదకత్వాలు, ప్రసంగాలతో అసంఖ్యాకంగా అభిమానాన్ని చూరగొన్న విశిష్ట వ్యక్తిత్వం గల సాహితీవేత్త, 'స్వాతి'లో 'కౌముదీ' అంతర్జాల పత్రికలో వచ్చిన ఎమ్వీయల్, హాస్యగుళికల వంటి ఫీచర్ రచనలను అక్షజ్ఞ ప్రచురణలకర్త విద్యావెంకట్, అధిక ప్రసంగం



పేరిట వెలువరించారు. కింకర్తవ్యం, ఉదయం ఆట, న+ఆస్తికులు, అద్దెఇళ్లు, బ్రహ్మచారి, కచేరిగది, యువతరం సంస్కృతి, నలభీమపాకం, నిద్ర–అందం, పెళ్లీ–చూపులు, తోటకూరకాడ, పేకాటకళ, మతభాషిత్వమ్ వంటి ఎన్నో మధ్యతరగతి మందహాసాలు, చక్కటి హాస్యభావ మిళితంగా ఈ ఫీచర్స్ చదివింప చేస్తున్నాయి. తెలుగుతనం వుట్టిపడే పలుకుబడితో, ఆరోగ్యవంతం, ఆహ్లాదకరమైన సినీ ప్రస్తావనలతో ఎమ్వీయల్ మెరిపించి ఆకట్టుకొంటారు. అధిక ప్రసంగం అన్న మాటకు వర్తించే అర్థం కాకుండా ప్రతీఫీచర్ చదివి హాయిగా నవ్వుకోవచ్చు. తెలుగువారి దైనందిన జీవితంలోకి యింత అందంగా, హాస్య, వ్యంగ్య భావనలతో తొంగిచూడడం బాపు, రమణల సాన్నిహిత్యం వల్లనే సాధ్యమవుతుందని ఎమ్వీయల్ ప్రతిభావంతంగా నిరూపించారు. అక్షజ్ఞ ఈ అమూల్య ప్రచురణ, తెలుగువారికి ఆత్మీయకానుక.

**(అధిక ప్రసంగం, రచన: ఎమ్వీయల్, వెల: రూ 150, ప్రతులకు: అక్షజ్ఞ ప్రచురణలు, 12-11-1364, 2వ అంతస్తు, పరాశర అపార్ట్‌మెంట్, వారాసిగూడ, సికింద్రాబాద్)** **– యర్రమిల్లి**

ఇటీవలే 'అక్షరనేత్రాలు' వచనా కవితా సంపుటితో కవన లోకంలోకి అడుగిడిన యువకవయిత్రి ఎన్.లహరి ద్వితీయ ప్రయత్నంగా 'నానీల తీరాన' విహారానికి ఆహ్వానం పలుకుతోంది. అల్పాక్షరాలతో భావగాఢతను పూరించి 'చరువు'

## 'నానీల తీరాన' విహరిద్దాం రండి!



(punch)తో లఘు కవితారూపాన్ని దేదీప్యమానం చేయడం అంత తేలికేం కాదు. లహరి నానీల సృజనలో ఈ మెలకువలను బాగానే ఆకళింపు చేసుకుందని చెప్పవచ్చు. 'అందుకోలేనంత/ ఎత్తులో భవనాలే/కాదు../ అనుబంధాలు కూడా' కనుమరుగైపోతున్న మానవ సంబంధాలను నానీకరించిన తీరు యిది. 'జీవన ప్రస్థానంలో/ చివరి మజిలీ/ మృత్యువేగా!/ మధ్యనంతా మిథ్యనే!' తత్వాన్ని కవిత్వీకరించడానికి పెద్ద వయస్సేమి అక్కర్లేదు. పరిశీలనానుభవం చాలును. 'అమ్మ మీద/ కవిత రాద్దామనుకున్నా/ సిరా/ చాలదేమోననిపించింది!' నిజమే! ఎంత రాసినా ఒడువని కావ్యం 'అమ్మ'. 'మా ఊర్లో వానొస్తే/ కాగితం పడవలో/ మరి పట్నంలో/ కార్లే పడవలు' వర్షం కురిసినప్పుడల్లా హైదరాబాద్‌లో మన కళ్లముందు సాక్షాత్కరిస్తున్న దుస్థితి యిది. ఈ ప్రక్రియ పట్ల మరింత అధ్యయనం, అవగాహన తోడైతే ముందుముందు లహరి అనర్ఘరత్నాల్లాంటి లఘు కవితలను సృజించగలరని నా నమ్మకం. **(నానీల తీరాన, రచన: ఎన్.లహరి, వెల: రూ 150, ప్రతులకు: ప్లాట్ నం.301, శ్రీరాంహోమ్స్, హెచ్ఐజి–96, వనస్థలిపురం, హైదరాబాద్)** **– రమణ వెలమకన్ని**

శీతాకాలంలో ఉసిరికాయలు మనకు అందుబాటులో ఉంటాయి. నోరూరించే ఉసిరితో ఎన్నోరకాల వంటల్ని తయారు చేయవచ్చు. ఉసిరి ఔషధాల గని అని మనకందరికీ తెలుసు. ఉసిరి రసం, జెల్లీలు, క్యాండీలు, ఛట్‌పటా ఆమ్లా, సాల్టెడ్ ఆమ్లా, ఆన్‌లైన్ మార్కెట్లో విస్తృతంగా కనిపిస్తాయి.



# ఆరోగ్య ఉ'సిరి'

ఆరోగ్యంతో పాటు కేశ సంరక్షణ, చర్మరక్షణలో కూడా ఉసిరి తోర్పడుతుంది. ఉసిరి ఉత్పత్తిలో మనదేశం ప్రపంచంలోనే మొదటిస్థానంలో ఉంది. ఉత్తరప్రదేశ్ ఉసిరిని ఉత్పత్తిలో మొదటిస్థానంలో ఉంటే, తమిళనాడు, మధ్యప్రదేశ్‌లు ఉన్నాయి. దేశంలో 35శాతం ఉసిరిని ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే పండిస్తున్నారు. జర్మనీ, అమెరికా, జపాన్, మలేషియా తదితర దేశాలకు మన ఉసిరిని ఎగుమతి చేస్తున్నాం. ఔషధగుణాలు, పోషక విలువల కారణంగా ఉసిరి ప్యూరీకి ఆయాదేశాలలో బాగా డిమాండ్ ఉంది. ఉసిరిని కాయలాగా చూడకుండా తాజాపండుగా సలాడ్స్‌లో వినియోగించవచ్చు. ఇంకా జామ్స్, జెల్లీ, పచ్చడి, కూరలు, సిరప్స్, వెనరీల్లో కూడా విరివిగా వాడుతున్నారు. ఆమ్ల ఆకులు, కాయలు, పండ్లు, పూలపై విశేషంగా జరిపిన పరిశోధనల వల్ల అనేక విషయాలు బయటపడ్డాయి. ఉసిరి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అధికంగానే ఉన్నాయంటున్నారు వైద్య నిపుణులు. బరువు తగ్గేందుకు పెద్ద మొత్తంలో కొవ్వును కరిగించేతత్వం ఉసిరికి ఉంది. శరీరం లోపల జీవక్రియ చక్కగా జరిగేలా చూస్తుంది. తద్వారా ప్రొటీన్ సింథసిస్ మెరుగుపడి కొవ్వు డిపాజిట్లు కరిగేలా చేస్తుంది. ఈ కారణం వల్ల ఉసిరి అందరికీ మంచిది. అందుకే ఊబకాయంపై యుద్ధం చేయడంలో ఉసిరి పాత్ర కీలకం.





## కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది

శరీరంలో రక్తప్రసరణ సాఫీగా జరిగేందుకు ఉసిరి తోడ్పడుతుంది. పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. ధమనులు, సిరల్లో కొవ్వు పదార్థాలు పేరుకుపోకుండా చూస్తుంది. తద్వారా గుండె ఆరోగ్యానికి రక్షణగా నిలిచి మేలు చేస్తుంది.

జలుబుకు మంచి వైద్యం

విటమిన్-సికి భాంగారారం అమ్లా. ఈ విటమిన్ వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. క్రమం తప్పకుండా విటమిన్-సి తీసుకోవడం వల్ల రోగనిరోధక వ్యవస్థలోని కణాలు మరింత వేగంగా పనిచేస్తాయి. చలికాలంలో జలుబుతో బాధపడేవారు ఉసిరిని వివిధ రూపాల్లో తీసుకోవడం వల్ల ఉపశమనం లభిస్తుంది.

## సరైన జీర్ణవ్యవస్థకు

ఉసిరికాయను కొరికినప్పుడు కసుక్కున శబ్దం వస్తుంది. ఈ కాయనిండా పీచుపదార్థాలే. కాబట్టి జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేస్తుంది. అంతేకాకుండా జీర్ణరసాలు బాగా ఉత్పత్తి అయ్యేలా చేసే గుణం ఈ కాయకి ఉంది. కడుపు ఉబ్బరం, అసిడిటీతో బాధపడుతున్న వారికి ఆమ్ల దివ్యౌషధం. ఉసిరిని ఆహారంలో తీసుకోవడం వల్ల అందులోని ఔషధగుణాలు కాలేయం నుంచి మలినానికి తొలగిస్తాయి.

## మధుమేహులకూ మంచిదే

రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించే 'ఎలగిటానిన్స్' అనే విశిష్టమైన సమ్మేళనాలు ఉసిరికాయలో మెండుగా ఉన్నాయి. కాబట్టి మధుమేహం చికిత్సలో ఉసిరిని వినియోగిస్తారు. ఇవేకాక భారతదేశంలో లభించే ఉసిరి రకం యాంటీ కేన్సర్ ఏజెంట్‌గా కూడా పనిచేస్తుందని ప్రాథమిక పరిశోధనలు

తెలియజేస్తున్నాయి. ఇలా అనేక ఆరోగ్యపరమైన కారణాల వల్ల ఉసిరి వినియోగం మునుపెన్నడూ లేనంతగా దేశవిదేశాల్లో పెరిగింది.

### తులసితో సమానంగా

కార్తీక మాసంలో తులసితో



సమానంగా ఉసిరిని కొలుస్తారు. దీనికి కారణం ఉసిరి చెట్టును సాక్షాత్తు విష్ణుమూర్తిగా పురాణాలు వర్ణిస్తున్నాయి. క్షీరసాగర మథనం తరవాత దేవదానవులు ఘర్షణలో కొన్ని పాల బిందువులు నేలమీద పడి ఉసిరి చెట్టుగా మారాయట. అందుకే ఉసిరిలో అన్ని సుగుణాలని చెబుతారు. ఆయుర్వేదం కూడా ఉసిరిని గొప్ప ఔషధ మొక్కగా వర్ణిస్తోంది. పైగా చలికాలంలో తప్పక తినాల్సిన కాయ ఉసిరి. ఇలా



ఆధ్యాత్మికంగా, ఆరోగ్యపరంగా కూడా ఉసిరిని సూపర్ ఫ్రూట్‌గా చెబుతారు. పచ్చళ్లు, జామ్, పళ్లరసాలు, జెల్లీ రూపంలోనే కాకుండా కూడా మార్కెట్లో 'ఉసిరి' లభ్యమవుతుండటం విశేషం.

### ఉసిరి రసంలో..

ఉసిరి రసాన్ని పరిమిత మోతాదులో తాగడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయని అంటున్నారు వైద్యనిపుణులు.

- రోగనిరోధకశక్తిని పెంచుతుంది.
- బరువు తగ్గించడం, నియంత్రణకు తోడ్పడుతుంది.
- శక్తిస్థాయిలను పెంచుతుంది.
- శరీరంలోని వ్యర్థాలను తొలగిస్తుంది.
- రక్తశుద్ధికి దోహదపడుతంఉది.
- డీహైడ్రేషన్ నుంచి కాపాడుతుంది.
- కంటిచూపును మెరుగు పరుస్తుంది.

### క్యాండీ ట్రెండ్!

పిల్లలకే కాదు పెద్దలకు కూడా క్యాండీలంటే మహా ఇష్టం. అయితే ఏది తిన్నా కూడా ఆరోగ్య ప్రమాణాల్ని పట్టించుకునే కాలం నేడు నడుస్తోంది. అందుకే మామూలు చక్కెరగోళీల కంటే ఆమ్లా క్యాండీలను తినడం ఎక్కువైంది. వయసుపైబడిని వాళ్లుసైతం ఈ విషయంలో ముందున్నారు. విశేషమేమిటంటే అమెరికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కెనడాలకు అత్యధికంగా ఆమ్లా క్యాండీలను మనదేశం ఎగుమతి చేస్తోంది. ఏటా 3,256 షిప్‌మెంట్స్‌లో మనదేశంలో తయారు చేసిన ఆమ్ల క్యాండీలు ఎగుమతి అవుతున్నాయి. మన తరువాతి స్థానాలను చైనా, దక్షిణ కొరియా ఆక్రమించాయి.

### సౌందర్యం...ఔషధం

ఎన్నో ఔషధ గుణాలు, పోషక విలువలున్న ఉసిరిని ఏయే పరిశ్రమల్ల ఎలా వినియోగిస్తారో తెలుసుకుందాం.

ఫార్మా: ఉసిరి పల్ప్, ఆమ్లా ప్యూరీని మందుల తయారీలో వాడతారు.
- నిద్రలేమి, రక్తహీనత, బ్రాంకైటీ, ఆస్తమాల నుంచి ఉపశమనానికి ఈ మందులు ఉపయోగపడతాయి.

బేవరేజ్: హెల్త్‌డ్రింక్స్, పళ్లరసాలు, మాక్‌టైల్స్ లో వాడతారు.

ఫుడ్: క్యాండీ, పచ్చళ్లు, స్వీట్లు, ఉసిరి పొడి, చట్నీలు, ఇతర కలినరీ ఐటమ్స్ తయారీలో వాడతారు.

కాస్మోటిక్: ఉసిరి ప్యూరీని కాస్మోటిక్ పరిశ్రమలో చర్మ పరిరక్షణ, కేశసంరక్షణ ఉత్పత్తుల్లో వినియోగిస్తారు.

ఉసిరిలో విటమిన్లు, మినరల్స్, ఫైబర్‌తోపాటు యాంటీఆక్సిడెంట్లు ఎక్కువ. వంద గ్రాముల ఉసిరిలో పోషకాలు ఎంతంత ఉన్నాయంటే..ఫైబర్: 4.3గ్రాములు,




విటమిన్ సి: 27.7మిల్లీగ్రాములు, విటమిన్ ఎ,ఆర్ఏఈ: 15 మైక్రోగ్రాములు, క్యాలరీలు: 44కిలో క్యాలరీలు, ప్రొటీన్లు: 0.5 గ్రాములు.


కార్టూని స్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతి స్తున్నాం. అంశం ఏదైనా సరే!

## కార్టూన్లకు ఆహ్వానం

మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా:

**ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,**

లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080.

sunmagvaartha@gmail.com

కథ

# ఆశ-నిరాశ

నరసింహాపురంలోని శేషయ్య సోమరి. అతనికి కష్టపడడం చేతకాదు. అతడు ఒకసారి పొరుగూరుకు కాలినడకన బయలుదేరాడు. దారిలో అతనికి తళతళ మెరుస్తూ ఒక బంగారు నగల మూట కనిపించింది. అతని కళ్లు జిగేలుమన్నాయి. తన చుట్టూ పరికించి చూశాడు. ఎవ్వరూ తనను గమనించడం లేదని నిర్ధారణ చేసుకున్నాడు. వెంటనే ఆ నగల మూటను తీసుకొని తన సంచిలో వేసుకొని ఇంటికి తిరిగి బయలుదేరాడు. ఇంటికి వచ్చిన తర్వాత అతడు తన భార్యతో 'ఓసెవ్! ఇన్ని రోజులు నాకు డబ్బు సంపాదించడం చేతకాదనీ, అసమర్థుడని నన్ను అన్నావు కదా! ఇప్పుడు ఏకంగా బంగారు నగల మూటనే సంపాదించాను. దీనితో మన దరిద్రం వదిలిపోతుంది' అని అన్నాడు. అది విని పరిగెత్తుకొని వచ్చిన అతని భార్య కాంతమ్మ 'ఆహా! మీరు ఎంత గొప్పవారండి. ఈ నగలు దొరికిన సంగతి మాత్రం ఎవరికీ చెప్పకండి' అని అంది. కానీ ఈ విషయం ఎలాగో పక్కింటి వారికి తెలిసిపోయింది క్రమక్రమంగా ఈ విషయం ఆనోటా ఈనోటా పడి గ్రామ పెద్దకు తెలిసింది. అతడు తన మనుషులను పంపి శేషయ్యను, అతని భార్య కాంతమ్మను పిలిపించాడు. వారు తమకు తేరగా దొరికిందనుకున్న ఈ నగల మూట గ్రామ పెద్దకు ఎలా తెలిసిందని ఆశ్చర్యపోయారు. అప్పుడు గ్రామ పెద్ద వారిని బంగారు నగల మూటను ఎక్కడ దాచారని ప్రశ్నించాడు. వారు తమకు ఆ మూట దొరకనే లేదని అబద్ధమాడారు. గ్రామ పెద్ద తన మనుషులను పంపి వారింట్లోని ఆ నగల మూటను తెప్పించాడు. వారు తమను క్షమించమని బతిమిలాడారు.



ఇంతలో అక్కడికి కాళయ్య అనే వ్యక్తి వచ్చి 'అయ్యా! ఈ మూట నాది' అని అన్నాడు. గ్రామ పెద్ద దాని ఆనవాళ్లు చెప్పమని అన్నాడు. అతడు అందులో ఒక చంద్రహారం ఉందని చెప్పాడు. కానీ అది అందులో లేదు. వెంటనే గ్రామపెద్ద అతన్ని పంపివేశాడు. ఆ తర్వాత పుల్లన్న అనే వ్యక్తి వచ్చి 'అయ్యా! నా మూట పోయింది ఇది నాది' అని అన్నాడు. అప్పుడు కూడా గ్రామ పెద్ద ఆనవాళ్లు చెప్పమన్నాడు. 'అందులో నెక్లెస్ ఉంది' అని అన్నాడు పుల్లన్న. కానీ అది కూడా ఆ మూటలో లేదు. అతడు వెళ్లిపోయాడు. ఆ తర్వాత మరో ఇద్దరు వచ్చి ఆనవాళ్ల సరిగా చెప్పలేక వెళ్లిపోయారు. తర్వాత గ్రామ పెద్ద ఆ మూటను వారికి ఇచ్చివేసి 'దీనిని మీరే తీసుకోండి' అని వారికి ఇచ్చాడు. వారు తమను శిక్షిస్తాడు అనుకున్న గ్రామపెద్ద తమకు నగల మూట ఇచ్చేసరికి పరమానంద భరితులై దాన్ని తీసుకొని వెళ్లిపోయారు. ఆ తెల్లవారి వారు నగల వర్తకుని వద్దకు వెళ్లి ఆయనకు ఆ నగల మూటను తీసి నగలను చూపించారు. వాటిని పరీక్షించిన అతడు అవి నకిలీ నగలు అనేసరికి వారికి నోట మాట రాలేదు. 'అయ్యా! ఈ మూటలోనివి నలికీ నగలా!' అని వారు ఆశ్చర్యపోయారు. అప్పుడు శేషయ్య భార్య భర్తను చీవాట్లు పెట్టి కష్టపడి పని చేయక ఇలా అదృష్టం మీద ఆధారపడావా! మనం చేసిన కష్టమే మనది. తేరగా దొరికిన వస్తువులు ఏమీ మనవి కావు' అని అంది. ఆనాటి నుండి శేషయ్య తన సోమరితనాన్ని వదిలిపెట్టి కష్టపడి పనిచేసి సంపాదించడం ప్రారంభించాడు.

**- సంగనభట్ల చిన్న రామకృష్ణయ్య**



# వార్త ఆదివారం

## బాలగేయం

### తేనెబొట్లు



చిట్టిపొట్టి పిల్లలారా!
జాతికి నిర్మాతలారా!
ప్రగతి పథమునందుకొనుము
చూచెద నా కన్నులారా!
వేళ్ల నొప్పి పుడుతుంటే
రాయలేను అనుకుంటే
నేడు ఈ స్థితి చేరవు
చదువు కష్టమనుకుంటే
చేతిరాత గుండ్రంగా
నోటిమాట సరళంగా
ఉంటేనే ఉత్తముడని
బడియంతా పొగుడునుగా
గడగడమని చదివేసి
చకచకమని రాసేసి
ప్రశంసలను పొందాలి
ప్రథముడిగా నిలిచేసి
క్రమశిక్షణ నేర్పుతారు
నైతికతను పెంచుతారు
మంచి ఉపాధ్యాయులెపుడు
మానవతను పంచుతారు.
సద్గురువుకు వందనం
మన నడతే చందనం
ఆజన్మాంతము గురువుల
రుణము తీర్చనే లేదు.

**- గుడిపూడి రాధ**

## హలో ఫ్రెండ్...


**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**- కె.ఫణీంద్ర,** నల్గొండ

**ప్రశ్న:** గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. డెత్ వ్యాలీలో రాళ్లు కదులుతాయంటారు. ఇదెలా సాధ్యం?



**జవాబు: ఫణీంద్ర!** కాలిఫోర్నియాలోని డెత్ వ్యాలీలో రాళ్లు స్పష్టంగా ఒక చోటు నుంచి మరో చోటుకు కదులుతున్నాయి. ఈ వింతకు శాస్త్రీయ వివరణ లేదు. అవి కదులుతుండగా ఎవరూ చూడలేదు. దాదాపు 5 కి.మీ. విస్తీర్ణంలోని ఎండిపోయిన ఒక చెరువులో చిన్న గులకరాళ్ల దగ్గర నుండి దాదాపు వంద కిలోల బరువుండే పెద్ద బండల వరకూ ఒక చోట నుంచి మరో చోటుకు కదులుతున్నాయి. అవి కదిలినట్టుగా నేల మీద చారలు, గీతలు, గుర్తులు కనిపిస్తున్నాయి. కొన్ని ఏకంగా ఆరు వందల దూరం కదులుతుండగా, పెద్ద బండలు మాత్రం 200 అడుగుల వరకు వెళ్లగలుగుతున్నాయి. పరిసర ప్రాంతాల లోని కొండల నుంచి వీచే బలమైన గాలులకు అవి జరుగుతున్నాయని కొందరు, అక్కడి నేల పొరల్లో మంచు పలకలు ఉండటం వల్ల ఇలా జరుగుతోందని మరికొందరు ఊహించి చెబుతున్నారుగానీ ఏదీ నిర్ధారణ కాలేదు.

**- ఎస్.యశ్వంతి,** హైదరాబాద్

**ప్రశ్న:** గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. చెవిలో గులిమి ఎలా ఏర్పడుతుంది?

**జవాబు: యశ్వంతి!** మనం తినే ఆహార పదార్థాలు, చెవి నిర్మాణాన్ని అనుసరించి గులిమి ఏర్పడుతుంది. వాస్తవానికి చెవిని మనంతటం మనం శుభ్రపరచాల్సిన అవసరం ఏమాత్రం లేదు. ప్రకృతి పరంగా దానంతట అదే శుభ్రపరచుకుంటుంది. ఆ ప్రక్రియలో భాగంగా గులిమి ఏర్పడి, చెవిలో నుంచి వెలుపలికి వస్తుంది. చెవిలోని సున్నితమైన భాగాలను ఇన్ఫెక్షన్ నుంచి కాపాడేందుకు గులిమి సాయపడుతుంది. ఇది సాధారణంగా ఉండాల్సిన స్థాయి కంటే ఎక్కువ వున్నా, తక్కువ వున్నా ఇబ్బందే. ఇయర్ కెనాల్ బయటి భాగంలో ఉండే ప్రత్యేక గ్రంథులు గులిమిని తయారు చేస్తాయి.



# ప్రకృతి సోయగాల ఉడిపి..

కర్ణాటకలో దర్శనీయ స్థలాలెన్నో ఉన్నాయి. పురాతన దేవాలయాల నుంచి అందమైన బీచ్‌లు, దట్టమైన అడవులు, ప్రకృతి సోయగాల వరకు అన్నీ చూడదగ్గ ప్రదేశాలే. ముఖ్యంగా శీతాకాలంలో ఈ ప్రాంతం ప్రధాన టూరిస్ట్ స్పాట్‌గా మారుతుంది. వర్షాకాలంలో కూడా చూడడానికి పెద్ద ఇబ్బంది ఉండదు.



ఉడిపి నగరం మంగళూరుకు 55 కిలోమీటర్ల దూరంలో, బెంగళూరుకు పశ్చిమ దిక్కున 422 కిలోమీటర్లు దూరంలో ఉంటుంది. ఇది ఉడుపి జిల్లా కేంద్రమే కాకుండా వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం. ప్రధాన పర్యాటక స్థలం ఈ నేపథ్యంలో ఉడుపి జిల్లా కర్ణాటకలోనే ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఒకటిగా నిలిచింది. సముద్ర రుచులు, సంప్రదాయ శాకాహార వంటకాలకు ఈ జిల్లా ప్రసిద్ధి.

## సముద్రంలో సెయింట్ మేరీస్ ఐలాండ్స్

ఉడుపిలో మల్పే బీచ్ నుంచి కొన్ని కిలోమీటర్లు అరేబియా సముద్రంలో వెళితే సెయింట్ మెరీస్ దీవులను చేరవచ్చు. ఇది కూడా ప్రత్యేకమైన పర్యాటక స్థలం. మొత్తం నాలుగు ద్వీపాల సమూహాన్ని కోకోనట్ ఐలాండ్స్ అని కూడా అంటారు. ఇక్కడ ఉండే బసాల్ట్ రాళ్లు ఎవరో పేర్చినట్లుగా చక్కగా అమరి ఉంటాయి. ఇటువంటి రాళ్ల భారతదేశంలో మరెక్కడా లేవు. పెద్దపెద్ద అలలతో కూడిన సముద్రంలో చిన్నచిన్న పడవల్లో ఈ దీవికి చేరుకోవాలంటే కొంచెం ధైర్యం ఉండాలి. ఇక మల్పే బీచ్ కూడా టూరిస్ట్‌స్పాట్.



## కోడి బీచ్ సాగర సంగమం

ఉడుపి నుంచి 36 కిలోమీటర్ల దూరంలో ఉండే కోడి బీచ్ కూడా ఆకర్షణీయమైన పర్యాటక ప్రదేశం. ప్రశాంతమైన వాతావరణంలో ఉండే బీచ్‌కు తక్కువమంది పర్యాటకులు వస్తుంటారు. దీంతో ఇక్కడ ప్రశాంతంగా ఆస్వాదించవచ్చు. ఈ బీచ్‌కు మూడుదిక్కులా సముద్రమే ఉండటంతో చాలా అద్భుతంగా ఉంటుంది. అలాగే ఇక్కడ సువర్ణా నది అరేబియా సముద్రంలో కలిసే సాగర సంగమం పాయింట్ కూడా ఉంది.

## సెయింట్ లారెన్స్ చర్చ్



ఉడుపి బస్టాండ్ నుంచి 18 కిలోమీటర్ల దూరంలో అత్తూర్ చర్చ్ లేదా సెయింట్ లారెన్స్ చర్చ్ కూడా సందర్శించాల్సిన ప్రాంతమే. ఇది రోమన్ క్యాథలిక్ చర్చ్ కావడం విశేషం. ఇక్కడ ఒక పాఠశాలతో పాటు అనాథాశ్రమం కూడా నిర్వహిస్తున్నారు. టిప్పు సుల్తాన్ కాలంలో ఈ కట్టడంలో క్రైస్తవులను బంధించారు. క్రైస్తవులు విడుదలైన తరువాత ఆ కట్టడాన్ని చర్చిగా నిర్మించుకొన్నారు. ఈ చర్చ్ మహిమ గల ప్రార్థనా మందిరంగా గుర్తింపు పొందింది.

## శ్రీకృష్ణ ఆలయం



13వ శతాబ్దంలో నిర్మించిన శ్రీకృష్ణమఠం అని పిలిచే శ్రీకృష్ణుని ఆలయం ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ. ఈ ఆలయాన్ని జగద్గురు శ్రీమద్వాచార్యులు స్థాపించారు. ఈ ఆలయానికి తెల్లవారుజాము నుంచి రాత్రి 9గంటల వరకు దర్శించుకోవచ్చు. భక్త కనకదాసుకు శ్రీకృష్ణుడు ఈ ఆలయంలో ప్రత్యేకంగా దర్శనమిచ్చాడని ప్రతీతి.

## మూకాంబికా అభయారణ్యం

జిల్లాలోని కొల్లూరు సమీపంలో ఉండే మూకాంబికా అభయారణ్యం కూడా సందర్శించదగ్గ ప్రదేశం. పశ్చిమ కనుమలు ఉండే ఈ వన్యజీవి సంరక్షణ కేంద్రం జంతుప్రేమికులకు అమితంగా నచ్చుతుంది. మొత్తం పచ్చదనంతో నిండిన దట్టమైన అటవీప్రాంతంలో విహరించడం మంచి అనుభూతినిస్తుంది. అలాగే చుట్టుపక్కల మూకాంబికా దేవాలయం, అబ్బే వాటర్ ఫాల్స్, అరిసినగుండి జలపాతం అలరిస్తాయి. తీరంలో మడ అడవుల్లో పడవల్లో విహారం కూడా చేయవచ్చు.



# ఆయుష్షును పెంచే మితాహారం

**ఆధునిక** కాలంలో సంపాదన పెరిగింది, తినేతిండిలో కూడా పలు మార్పులొస్తున్నాయి. గతంలో పోల్చుకుంటే, తినే తిండిని మనం పెంచుకుంటున్నాం. దీనికి కారణం బయట ఆహారం విచ్చలవిడిగా లభ్యమవడమే. ఫాస్ట్‌ఫుడ్‌సెంటర్లు, హోటళ్లు, టిఫిన్‌సెంటర్లు వీధికి నాలుగైనా ఉంటున్నాయి. రోజుకు ఒక్కసారే భోజనం చేసేవాళ్లు ఎప్పుడూ ఆరోగ్యంగా ఉంటారు. రెండుసార్లు భోజనం చేస్తే శారీరక బలం పెరుగుతుంది. అయితే రోజుకు మూడుసార్లు భోజనం చేయడం వల్ల వ్యాధులూ నొప్పులూ వస్తాయి. అదే నాలుగుసార్లు చేస్తే అకాలమరణం తప్పదంటున్నారు నిపుణులు. ఆరోజుల్లో మనిషికి శారీరకశ్రమ ఎక్కువ ఉండేది. కష్టపడి సంపాదించుకున్న ఆహారం కాబట్టి దాన్ని అపురూపంగా, మితంగా తినేవారు. దినచర్య కూడా సూర్యోదయంతో మొదలై సూర్యాస్తమయంతో ముగిసేది. దాంతో సహజంగానే 12 నుంచి 16 గంటలు సమయం ఆహారం తీసుకోకుండా ఉండేవారు. శరీరంలో జీవచర్యలకు కావలసినంత సమయం దొరికేది. ఇప్పుడు వినోదానికి సమయం పెరిగింది. పగలూ రాత్రీ అన్న తేడా లేకుండా కదలకుండా కూర్చుని పనిచేయడం, ఎక్కువ సమయం మెలకువగా ఉండడం, ఉన్నంతసేనూ ఏదో ఒకటి తింటూ ఉండడం అలవాటైపోయింది. అప్పుడు శక్తికోసమే తినేవారు. ఇప్పుడు రుచులకోసం తినడం పెరిగింది. ఆహారం ద్వారా కెలోరీలు ఎక్కువవడమూ వ్యాయామం లేకపోవడం వల్ల ఖర్చయ్యే కెలోరీలు తగ్గడమూ వెరసి, స్థూలకాయం సాధారణమైపోయింది.

అప్పుడప్పుడు ఉపవాసం మంచిదే ఆహారం తీసుకున్న తర్వాత మన కడుపులో ఏం జరుగుతుందో తెలుసుకుంటే ఉపవాసం ప్రాధాన్యం అర్థమవుతుంది. భోజనం చేసిన తర్వాత అందులోని కార్బోహైడ్రేట్లు గ్లూకోజుగా మారి చిన్నపేగు ద్వారా రక్తంలో కలిసి శరీరంలోని అన్ని అవయవాలకూ శక్తినిస్తాయి. అదనంగా ఉన్న గ్లూకోజు-లివర్‌లోనూ అడిపోజ్ కణజాలంలోనూ గ్లైకోజెన్, కొవ్వుల రూపంలో భవిష్యత్ అవసరాల కోసం నిల్వ ఉంటుంది. ఉపవాసం ఉన్నప్పుడు ఆహారం అందదు. కాబట్టి కాలేయం ఈ గ్లైకోజెన్‌ను గ్లూకోజ్‌గా మార్చి శరీరానికి కావలసిన శక్తినిస్తుంది. శారీరకంగా చురుగ్గా క్రియాశీలంగా లేని వ్యక్తికి పది పన్నెండు గంటల తర్వాతే ఈ గ్లైకోజెన్ నిల్వల్ని వాడుకునే అవసరం వస్తుంది. అదే శరీర శ్రమ చేసేవారికి తక్కువ సమయం సరిపోతుంది. గ్లైకోజెన్ కూడా అయిపోయాక అడిపోజ్ కణజాలంలోకి శక్తిని అంటే కొవ్వును కరిగించి వాడుకుంటుందన్నమాట. ఎక్కువ గంటలు ఆహారం తీసుకోకుండా ఉపవాసం ఉంటేనే ఇలా శరీరంలోని అదనపు కొవ్వు కరిగిపోవడానికి అవకాశం ఉంటుంది. ఆ అవకాశం ఇవ్వకుండా ఈలోపే మరోసారి భోజనం చేస్తే కొవ్వు నిల్వలు పెరగడమే కానీ తగ్గే ప్రసక్తి ఉండదు. గ్లూకోజ్‌గా మారిన ఆహారాన్ని కణాలకు చేరవేసేది ఇన్సులిన్ హార్మోన్. నోటికి విరామం ఇవ్వకుండా ఆహారం తీసుకుంటూ ఉంటే ఈ ఇన్సులిన్ స్థాయి కూడా ఎప్పుడూ గరిష్టంగా ఉంటుంది. దాంతో కొన్నాళ్లకు కణాలు ఇన్సులిన్‌కి స్పందించడం మానేస్తాయి. ఫలితంగా షుగర్ వ్యాధి సమస్య తలెత్తుతుంది. సమయానికి తినడం అవసరమే ఏం తింటున్నామన్నది మాత్రమే కాదు, ఎప్పుడు తింటున్నామన్నదీ కీలకమేనంటున్నారు నిపుణులు. కండరాలకు నష్టం లేకుండా బరువు తగ్గి, శరీరర సామర్థ్యం పెరుగుతుంది. స్థూలకాయం రాదు. ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుంది కాబట్టి మధుమేహాన్నీ నివారించవచ్చు.



అతిగా ఉపసవాసం మంచిది కాదు ఉపవాసం మంచిదన్నారని అదేపనిగా చేస్తే మొదటికే మోసం వచ్చే ప్రమాదం ఉందంటున్నారు శాస్త్రవేత్తలు. రోజుకు 16 గంటల కన్నా ఎక్కువ సమయం తరచూ ఉపవాసం ఉండేవారికి పిత్తాశయంలో రాళ్లు ఏర్పడవచ్చు. ❑

కథ

శ్రీనివాసరావు తిరుక్కోవులూరు

# స్నేహాబంధం

వేదాచలం అందరి రచయితల్లాగే తన సాహిత్యాన్ని అమితంగా ప్రేమిస్తుంటాడు. ఎవరైనా అతను రాసిన రచనలని మెచ్చుకున్నా, కాస్త పొగిడినా వేదాచలం గుండెలు అమితానందంతో ఓ అరంగుళమెత్తు ఉబ్బిపోతుటాయి. అలాగే అతను రచనలను ఎవరైనా విమర్శించినా, తక్కువ చేసి మాట్లాడినా అతని హృదయం ఆక్రోశంతో దహించుకుపోతోంది. బయటి ప్రపంచానికి మాత్రం 'ఏ విషయం నన్ను కించిత్ కూడా చలింపజేయదు. నేను అన్నిటికీ అతీతుణ్ణి!' అన్నట్లు మొహంపై ఓ చిరునవ్వు పులుముకుని మహర్షి మాదిరి స్థితప్రజ్ఞత కనబరుస్తూ పరోక్షంగా తన విద్వత్తునూ, విజ్ఞతనూ ఏదో విధంగా చాటుకుంటుంటాడు.

అతను మేధస్సు పరంగా తానెంతో అపరిమిత పరిపక్వతా, అసాధారణ పరిణతా సాధించిన అపర సరస్వతిలా బాహ్య ప్రపంచానికి కనిపించడానికి నిరతరం పరితపిస్తుంటాడు.

ఆరోజు ఆదివారం కావడంతో ఇంట్లోనే వున్న వేదాచలం దినపత్రికను ఆమూలాగ్రం ఆసక్తిగా తిరగేస్తున్నాడు.

సరిగ్గా అప్పుడే 'ట్రింగ్ ట్రింగ్' మంటూ అతనింటి కాలింగ్ బెల్ మోగింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో వేదాచలమే గబగబా వెళ్లి తలుపు తీసాడు. ఎదురుగా తన మిత్ర రచయితా, ఆఫీస్ కొలీగూ అయినటువంటి విష్ణుమూర్తి నిష్కల్మషంతో నవ్వుతూ కన్పించాడు.

వేదాచలం భార్య తన పిన్నికూతురు పెళ్లంటూ ముందురోజు ఊరెళ్లింది. సాహిత్యాన్ని గురించి పిచ్చాపాటిగా ముచ్చటించుకుందామని విష్ణుమూర్తి కోరిక మేరకు వేదాచలమే తప్పదన్నట్టుగా అతన్ని తనింటికి రమ్మనమని ఆహ్వానించాడు, కాస్త అయిష్టంగానే!

వేదాచలం, విష్ణుమూర్తిలు తీరిగ్గా కలుసుకోవడం ఆరు నెలలకు పైమాటే అయ్యుంటుంది. విష్ణుమూర్తి వీలు కుదిరినప్పుడల్లా ఇరువురూ కలిసి అలా మేధోమథనం చేస్తే సమృద్ధికరమైన సాహిత్య సంపద సంప్రాప్తించినట్టుగా చెప్పలేనంత ఆనందానుభూతికి లోనవుతుంటాడు. కానీ వేదాచలం, విష్ణుమూర్తిని తరచూ కలుసుకోవడానికి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వడు.

విష్ణుమూర్తి, వేదాచలం ఇంట్లోకి అడుగు పెడుతూ "ఏంటి చలంగారూ.. ఈరోజు ఉత్సాహంగా, ఉల్లాసంగా కనిపిస్తున్నారు. కొత్త కథ రాసారా?" అంటూ సరాసరి అసలు విషయంలోకి వచ్చేస్తూ ఆసక్తిగా అడిగాడు. వేదాచలం అతన్ని లోపలికి ఆహ్వానిస్తూ "మా సాహిత్యం నత్తనడకతో సాగిపోతోంది. మీ అంత కాదుగా!" అన్నాడు నిష్ఠూరాన్ని తన గొంతులో పలికిస్తూ.

విష్ణుమూర్తి సోఫాలో చతికిలపడుతూ "చలంగారూ, ఆ మధ్య ఏదో కథ రాస్తున్నానని చెప్పారు కదా. అదెంతవరకు వచ్చిందండీ?" అడిగాడు ఉపోద్ఘాతంగా కాస్త ఆరాటంతో. వేదాచలం, విష్ణుమూర్తి అడిగిన ప్రశ్నకు ఎలా బదులివ్వాలో అర్థంకాక ఒక్క క్షణం తటపటాయించాడు.

ఎందుకంటే– రాశానని నిజం చెప్తే అది చూపించమని అడుగుతాడని వేదాచలం భయం. విష్ణుమూర్తి తన రచన చదివి అందులోని ఏ కొంత భాగమైనా కాఫీ తాగినంత తాపీగా కాపీ కొట్టేయ్యెచ్చు.. అనేది అతని అతిభయంకరమైన అపనమ్మకం.

విష్ణుమూర్తికి అలాంటి నీచ స్వభావం వున్న వ్యక్తిత్వం లేదని తెలిసినా, ఎక్కడో తెలియని కాస్త అనుమానంతో కూడిన జాగరూకత వహిస్తుంటాడు వేదాచలం.


"ఏదోలెండి.. ఓ కథ నడుస్తోంది అరకొరగా.. ఇంకా పూర్తి కాలేదు" అన్నాడు వేదాచలం అనాసక్తిని ప్రదర్శిస్తూ. మళ్లీ తనే కొనసాగిస్తూ "ఈ మధ్య కాలంలో మీరే విరివిగా రాస్తున్నారు. నా సంగతి పక్కన పెట్టండి. నా అంచనా ప్రకారం మీతో పాటు ఇప్పుడు ఏదో రచనని మీ వెంటబెట్టుకుని వచ్చే వుంటారు" అన్నాడు కాస్త సందేహాత్మకంగా విష్ణుమూర్తిని సాంతం చదివేసినట్టుగా.

వేదాచలం మాటలకు విష్ణుమూర్తి మొహం చిచ్చుబుడ్డి మాదిరి ఒక్కసారిగా కాంతివంతమైంది. వెలిగిపోతోన్న విష్ణుమూర్తి మొహం చూస్తేనే స్పష్టంగా అర్థమైంది వేదాచలంకి... విష్ణుమూర్తి తను రాసిన కథను తనకు చూపించడానికి తీసుకొచ్చాడని.

విష్ణుమూర్తి ఈ మధ్య కాలంలోనే రాయడం మొదలుపెట్టాడు. ఇద్దరూ కాస్త అటు ఇటుగా యాభైలో పడిన సమ వయస్కులు. కాకపోతే వేదాచలం, విష్ణుమూర్తికి ఓ రెండేళ్లకు ముందే భూమ్మీద పడ్డాడు.

వేదాచలం రచనా వ్యాసంగాన్ని ఇరవై ఏళ్లుగా సాగిస్తున్న సీనియర్ రైటర్. విష్ణుమూర్తి మాత్రం గత మూడేళ్ల నుంచే రాయడం మొదలుపెట్టాడు.

విష్ణుమూర్తీ, వేదాచలం ఒకే ఆఫీసులోనే ఉద్యోగాలు చేస్తున్నారు. వేదాచలం సీనియర్ అసిస్టెంట్ అయితే, విష్ణుమూర్తి జూనియర్ అసిస్టెంట్. ఆ ఆఫీసులో తనకు వస్తోన్న ప్రత్యేక గుర్తింపుకు కళ్లు కుట్టుకుని కడుపుమంటతో తనలాగే అందరి దగ్గర 'రచయిత' అనే ఘనకీర్తిని సంపాదించుకోవాలని అత్యాశ పడుతున్నాడని వేదాచలం అప్పుడప్పుడు విష్ణుమూర్తి గురించి తనకు తెలిసిన వాళ్ల దగ్గర చెప్పుకుని తెగ బాధపడిపోతుంటారు.



విష్ణుమూర్తి మాత్రం అప్పుడప్పుడు వేదాచలంతో "మీరే నాకు స్ఫూర్తి" అంటూ వేదాచలాన్ని ఓ మెట్టు పైనే కూర్చోబెడుతుంటాడు. విష్ణుమూర్తి అడపా దడపా అలవోకగా రాసుకుపోతుంటే, వేదాలచం బద్ధకిస్తూ ఉబుసుపోక కబుర్లతో కాలక్షేపం చేస్తూ అప్పుడప్పుడు మాత్రమే తన కలానికి పని కల్పిస్తుంటాడు.

**"చలంగారూ, మీ కథకు ప్రథమ బహుమతి వచ్చిందని విన్నాను. మీకు నా హృదయపూర్వక అభినందనలు" అంటూ విష్ణుమూర్తి శుభాకాంక్షలను తెలియజేసాడు.**

విష్ణుమూర్తి, తను కథలు రాసిన కొత్తల్లో ప్రతీ రచనని వేదాచలంకి చూపించేవాడు. వేదాచలం చక్కని సలహాలు, సలహాలతో పాటు ఆ రచనలకు దోహదపడే అంశాలు సహృదయంతో సూచించేవాడు. ఈ మధ్య కాలంలో విష్ణుమూర్తి ఇబ్బడిముబ్బడిగా రచనలు చేస్తుండటంతో, వేదాచలం తన పనిఒత్తిడి మూలంగా అతను రాసిన రచనలేవీ చూడ్డానికి వీలు కుదరలేదు. విష్ణుమూర్తి తనకు తోచిందేదో రాసుకుంటూ బుల్లెట్ ట్రెన్‌లా దూసుకుపోతుంటే, వేదాచలం తన రచనా వ్యాసంగాన్ని భారంగా, నిర్వేదంగా కొనసాగిస్తున్నాడు.

విష్ణుమూర్తి రచనలు ఏదో ఒక పత్రికలో వస్తుండటంతో వేదాచలంలో ఓ అసూయ నెమ్మదిగా చోటు చేసుకుంది. తనకురాని గుర్తింపు, గౌరవం ఆ విష్ణుమూర్తికి దక్కుతున్నాయని వేదాచలం అంతులేని నిరాశ నిస్పృహలతో కుమిలిపోయేవాడు.

"తను ఇరవై ఏళ్లుగా సాధించినది.. అతను కేవలం మూడేళ్లకే ఒడిసిపట్టుకున్నాడు. తనతో సరిసమానంగా పేరు ప్రఖ్యాతులు ఆర్జించుకున్నాడు.

విష్ణుమూర్తి "చలంగారూ, ఓ కథ పోటీకి ఈ కథ పంపించాలని అనుకుంటున్నాను. మీరొకసారి కథను చూసి ఏమైనా మార్పులు, చేర్పులు సూచించగలరు" అంటూ కొన్ని పేపర్లు వేదాచలం చేతిలో పెట్టాడు.

వేదాచలం అతని కథని సాంతం చదివాడు. ప్రతీ అక్షరాన్ని అతను హృదయానికి హత్తుకునేట్టుగా, ప్రాణం పెట్టి రాసినట్టుగా అనిపించింది. కానీ ఆ విషయాన్ని బయటికి చెప్పడానికి అతని అహం అడ్డుపడింది. విష్ణుమూర్తి రాసిన కథ చదవగానే వేదాచలంలో నిద్రాణమైన అసూయాసర్పం ఒక్కసారిగా విషపు బుసలు కొట్టింది.

"కథ బాగానే వుంది కానీ కథలో ఆత్మ లోపించింది" అన్నాడు అసంతృప్తిగా పెదవి విరుస్తూ.

వేదాచలం మాటలకు విష్ణుమూర్తి "ఎలా సరి చేయాలో మీరే చెప్పండి" అన్నాడు వినమ్రతగా.

అతనలా అడుగుతాడని ముందే ఊహించిన వేదాచలం ఆ కథకు బహుమతి రాకుండా ఉండేందుకు తన శాయశక్తులా వంచనతో కూడిన ఆలోచన చేసి, కథనంలోని సౌందర్యం, వస్తువులోని వైవిధ్యం చెడిపోయే రీతిలో కొన్ని మార్పులు, కూర్పులు సూచించాడు.

వేదాచలం చెప్పిన సూచనలు విష్ణుమూర్తికి అంతగా రుచించకపోయినా, రచనా రంగంలో అతని అనుభవం, విద్వత్తు జ్ఞప్తికి వచ్చి వేదాచలం చెప్పిన విషయాలకు మౌనంగా తలాడించాడు.

అటుపిమ్మట సాహితీ మిత్రులిద్దరూ సాహిత్యం గురించి చాలాసేపు ఆ ముచ్చట ఈ ముచ్చట చర్చించుకున్న అనంతరం విష్ణుమూర్తి, వేదాచలం దగ్గర సెలవు తీసుకుని తనింటికి వెళ్లిపోయాడు.

..............

రెండు నెలలు యథాలాపంగా గడిచిపోయాయి. ఒకరోజు ఉదయం ఎనిమిది గంటలు కావస్తుండగా వేదాచలం ఇంట్లో అతని మొబైల్ ఫోన్ రింగైంది. "ఏదో కొత్త నంబరు.." అనుకుంటూ వేదాచలం "హలో.." అంటూ ఆ కాల్ లిఫ్ట్ చేశాడు.

"వేదాచలంగారూ, మీ 'బంధం' కథ ప్రథమ బహుమతికి ఎన్నికైంది.. మీకు అభినందనలు" అని ఎవరో అట్నుంచి చెబుతున్నారు. వేదాచలానికి ఏమీ అర్థం కాలేదు. ఎందుకంటే ఈ మధ్య కాలంలో ఆఫీసులో పనిఒత్తిడి మూలంగా ఏమీ రాయలేకపోయాడు. ఏ కథనూ ఏ పోటీకి పంపించలేదు. ఫోన్ చేసిన వ్యక్తిని ఆ కథల పోటీ వివరాలు అడిగాడు. "నేను చాలా పోటీలకు రాస్తుంటాను.. వెంటనే గుర్తుకు రావడం లేదు" అన్నాడు నీళ్లు నములుతూ తన కంగారుని కప్పిపుచ్చుకుంటూ. ఆ నిర్వాహకుడు కథల పోటీ గురించి విపులంగా చెప్పాడు. అతను చెప్పింది వేదాచలంకి సరిగా అర్థం కాకపోయినా గుర్తుకు వచ్చిందంటూ ఫోన్ కట్ చేసి చాలాలాసేపు ఆలోచన చేసాడు.

గబ గబా తను పంపించే కథల వివరాలు రాసుకునే డైరీని ఆత్రంగా తిరగేసాడు. అందులో ఆ కథల పోటీకి తను కథ పంపించిన దాఖలాలు ఎక్కడా కన్పించలేదు. తరువాత చాలాసేపు బుర్రబద్దలు కొట్టుకుని ఆలోచించుకున్నాక, ఆ పోటీకి తను కచ్చితంగా కథ పంపించలేదని నిర్ధారించుకున్నాడు. ఆ పోటీ నిర్వాహకులే ఎక్కడో పొరపాటు పడుంటారన్న నిర్ణయానికి వచ్చేసాడు వేదాచలం. అప్పుడే అతని ఫోను మళ్లీ రింగయింది. ఆ కాల్ తన సాహితీ మిత్రుడు విష్ణుమూర్తి నుంచి, అతనికి ఈ విషయం చెప్పాలా, మానాలా అని ఆలోచిస్తూ కాల్ లిఫ్ట్ చేసాడు వేదాచలం.

"చలంగారూ, మీ కథకు ప్రథమ బహుమతి వచ్చిందని విన్నాను. మీకు నా హృదయపూర్వక అభినందనలు" అంటూ విష్ణుమూర్తి ఎంతో ఆనందంగా తన శుభాకాంక్షలను తెలియజేసాడు.

విష్ణుమూర్తి మాటలకి వేదాచలం మరింత అయోమయంలో పడిపోయాడు. వేదాచలం మిత్రుడు విష్ణుమూర్తికి నిజం చెప్పేయాలని ఒక నిశ్చయానికి వచ్చి "మూర్తిగారూ, మీకో విషయం చెప్పాలి. నిజానికి నేను ఆ పోటీకి ఏ కథనూ పంపించలేదు. మీరంతా నా కథకి ప్రథమ బహుమతి అంటున్నారు. అంతా గందరగోళంగా ఉంది" అంటూ యదార్థాన్ని ఉన్నదున్నట్టుగా చెప్పేసాడు.

వేదాచలం చెప్పినదంతా మౌనంగా విన్న విష్ణుమూర్తి "చలంగారూ, మీకో విషయం చెప్పాలి. మీరు చాలా కాలం క్రితం ఓ కథకి ముగింపు ఎలా ఇవ్వాలో తెలియట్లేదని, మీ కథ ఒకటి నా చేతిలో పెట్టి, నన్ను చూడమని ఇచ్చారు. నేను మీ కథను గురించి ఆలోచన చేసి, అద్భుతమైన ఓ ముగింపుతో పూర్తి చేసాను. ఒకరోజు మన ఆఫీసులో మీరు క్యాంటిన్‌కు వెళ్లినప్పుడు మీ మొబైల్ టేబుల్ మీద పెట్టి మర్చిపోయారు. నేను ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాను. వెంటనే నా మెయిల్ నుంచి మీ కథను మీకు మెయిల్ చేసి, ఆ తర్వాత మీ పేరుతో మీ మెయిల్ నుంచి ఆ కథల పోటీకి పంపించాను. అది మీకు తెలియకుండా జాగ్రత్త పడ్డాను. ఎందుకంటే మీకు సడన్ సర్‌ప్రైజ్ ఇద్దామనే ఇదంతా చేసాను. ఆ కథే ఈరోజు ఉత్తమ కథా రచయితగా మిమ్మల్ని నిలబెట్టింది. మీకు బహుమతి సాధించి పెట్టింది.

నేను చేసింది తప్పే. మీరు నన్ను తప్పక క్షమించాలి" అన్నాడు విష్ణుమూర్తి.

విష్ణుమూర్తి చెప్పిందంతా విన్న వేదాచలం ఉన్న చోటునే దిగ్భ్రమతో స్థాణువైపోయాడు. షాక్‌లో వున్న వేదాచలంకి తన మిత్రుడైన విష్ణుమూర్తి మహోన్నత వ్యక్తిత్వానికి తల తిరుగుతున్నట్టు అనిపించింది. అతనికి తను కీడు తలపెడితే– అతను మాత్రం తన ఉన్నతికై ఎంతగా ఆరాటపడుతున్నాడు! అని మనసులోనే పశ్చాత్తాపంతో వేదన పడుతుండగా, అట్నుంచి విష్ణుమూర్తి "వేదాచలంగారూ, నాపై కోపం రాలేదు కదా!" అడిగాడు.

తనను అనూహ్యమైన అగాథంలోంచి పైకి లాగుతున్నట్టున్న ఆలోచనల్లోంచి తేరుకున్న వేదాచలం "ఎంత మాట మూర్తిగారూ, నిజానికి మీరు స్వచ్ఛమైన స్నేహానికి నిలువెత్తు నిర్వచనం! ఇప్పుడు ఫోన్‌లో ఇంతకన్నా ఇంకేమి మాట్లాడలేకపోతున్నాను. ఇప్పుడే స్వయంగా వచ్చి మిమ్మల్ని కలవాలి" అంటూ ఫోన్ కట్ చేసి, తన కృతజ్ఞ తలు చెప్పుకోవడానికి హడావుడిగా విష్ణుమూర్తి ఇంటికి బయల్దేరాడు.

...............

ఆ సభా ప్రాంగణమంతా రచయిత(త్రి)లతో కళకళలాడిపోతోంది. ఆరోజే కథలకు బహుమతి పొందిన కథారచయితల సన్మాన సత్కార్యాలకు, బహుమతి ప్రదానోత్సవానికి ఏర్పాట్లు సందడిగా జరుగుతున్నాయి. నిర్వాహకులు హడావిడి పడుతున్నారు.

అప్పటికే ఆ సభా ప్రాంగణానికి విచ్చేసిన వేదాచలం, విష్ణుమూర్తులు పక్క పక్కనే కూర్చున్నారు. వేదాచలం తన ప్రాణమిత్రుడైన విష్ణుమూర్తిని అపురూపంగా చూస్తున్నాడు. అతనలా తరచూ తదేకంగా, తాదాత్మ్యంగా చూస్తూనే ఉన్నాడు.

విష్ణుమూర్తికి వేదాచలం అభిమానాన్ని తట్టుకోవడం చాలా ఇబ్బందిగా మారింది. వేదాచలం తన కథకు బహుమతి ప్రకటించిన ఆరోజు మొదలు ప్రతిరోజూ తన మిత్రుడు విష్ణుమూర్తిని మునుపటిలా కాకుండా తన కోసం, తనకోసం అరుదెంచిన అరుదైన ఆత్మీయ బంధంగా స్నేహితుణ్ణి భావిస్తున్నాడు.

ఆ సభావేదిక ముఖ్య అతిథులతోనూ, వక్తలతోనూ నిండుగా, కన్నుల పండువగా కనిపిస్తోంది. వేదిక మీదున్న అతిరథ మహారథులందరూ తమ అమృతతుల్యమైన సాహితీ ప్రసంగాలను వితరణ కావించారు.

అనంతరం బహుమతుల ప్రదానం, సన్మాన కార్యక్రమం ప్రారంభించారు.



సభా నిర్వాహకులు మొట్టమొదటిసారిగా మొదటి బహుమతి సాధించిన వేదాచలం పేరుని సగర్వంగా ప్రకటిస్తూ అతన్ని వేదిక మీదకు ఆహ్వానించారు.

ఆ పిలుపు తన కోసమేనని అప్రమత్తమైన వేదాచలం కుర్చీలోంచి లేచి, గబగబా వేదిక మీదకు వెళ్లాడు. మైకు అమర్చిన పోడియం దగ్గరగా వెళ్లి "ఎందరో మహానుభావులు! అందరికీ వందనాలు!! ఈ సన్మానంగానీ, నా కథకు బహుమతిగానీ పొందగలుగుతున్నానంటే అది నా మిత్రుడు విష్ణుమూర్తి మూలంగానే! ఈ వేదికపై నా స్నేహితుణ్ణి గౌరవించుకునే అవకాశాన్ని ఇవ్వాల్సిందిగా నిర్వాహకులను అభ్యర్థిస్తున్నాను.." అంటోన్న వేదాచలం మాటలకు ఆడిటోరియమంతా గాఢమైన నిశ్శబ్దంతో నిండిపోయింది.

వేదాచలం ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ కొనసాగింపుగా "బహుమతి పొందిన నా కథని ఊహించని ముగింపుతో, చక్కని మలుపుతో నన్నీ వేదికపై నిల్చోబెట్టాడు. నా మిత్రుడు విష్ణుమూర్తిని వేదిక మీదకి స్నేహపూర్వకంగా మనసారా ఆహ్వానిస్తున్నాను. కరతాళ ధ్వనులతో అతన్ని స్వాగతిద్దాం" భావోద్వేగంతో అంటున్న వేదాచలం మాటలకు ఆ ఆడిటోరియమంతా ఒక్కసారిగా చప్పట్లతో మార్మోగిపోయింది.

ఆ సభలోని వారంతా వేదిక ముందు కూర్చున్న విష్ణుమూర్తి వైపు చూసారు. అప్పుడతను అక్కడున్న అందరికీ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచాడు. విష్ణుమూర్తి కుర్చీలోంచి ఇబ్బందిగా లేచి వేదిక వైపుగా నడిచాడు హుందాగా. అతని మనసు ఉద్వేగంగా, ఆనందంతో ఆకాశపుటంచులను తాకుతోంది.

పోటీ నిర్వాహకులు వేదాచలాన్ని శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం వేదాచలం కోరికను దృష్టిలో పెట్టుకుని, అతను విష్ణుమూర్తిని ఆ సభావేదికపై గౌరవించుకోవడానికి అంగీకరించారు.

...............

"ఎంతో శ్రమ పడి కథను తిరగరాసి, పేరు ప్రఖ్యాతుల్లో అతనికి చోటు కల్పించడం నాకేమీ నచ్చలేదండీ. మీకు రాసేందుకు సబ్జెక్టులే దొరకలేదా? మీ కష్టం అతని సొంతం చేయడం అస్సలేమీ బాగోలేదండి.

మీకు బాధగా లేదా? అందులోనూ వ్యక్తిత్వం లేని ఆ మనిషి కారణంగా చాలా సార్లు నా దగ్గరే నొచ్చుకున్నారు. అన్నీ మర్చిపోయారా?" అంది విష్ణుమూర్తి భార్య, భర్త నిర్వాకాన్ని నిందిస్తున్నట్టుగా.

భార్య మాటలకు విష్ణుమూర్తి చిన్నగా నవ్వేసాడు. అతని నవ్వులో నిశ్చలమైన నిర్మలత్వం ద్విగుణీకృతమవుతూ మనిషి తత్వపు ఎల్లలు దాటిన మనీషితత్వం ఉట్టిపడుతోంది. "అతనిలోని అహంకారానికి, అజ్ఞానానికి ఎలా చరమగీతం పలకాలో అర్థంకాక ఇన్నాళ్లూ ఎంతగానో వేదనపడ్డాను. అతనిలోని ఈర్ష్యా, అసూయలతో నన్ను తప్పుదోవ పట్టించాలనుకుని, తను తప్పుడు దోవలో పడిపోయాడు. అది నా మనసుని ఎంతగానో కలచివేసింది.

నా జీవితంలో ఒక ముఖ్యమైన భాగం అనుకున్న నా మిత్రుడు పాతాళానికి దిగజారిపోతుంటే చూస్తూ ఊరుకోగలనా? పక్క దారి పట్టినంత మాత్రాన వదిలేసుకుంటానా? పరిస్థితుల ప్రాబల్యంలో అనాలోచితంగా తీసుకున్న నిర్ణయాల మూలంగా అగాథంలోకి కొట్టుకుపోతుంటే, ఒక నిజమైన మిత్రుడిగా నా స్నేహ హస్తాన్ని అందించాల్సిన బాధ్యత నాకుంది కదా!

వేదాచలం గారిని మంచి మనిషిగా, ఒకప్పటి నా పాత మిత్రునిగా మార్చుకునే సువర్ణావకాశం ఆ కథ రూపంలో రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఓ కథ మా స్నేహితుల జీవితాల కథను మార్చివేసింది.

మిత్రుడు చెడు మార్గాన పడితే, స్నేహబంధాన్ని ప్రేమించి, గౌరవించే ఏ స్నేహితుడూ చూస్తూ ఊరుకోలేడు. అదే నేనూ చేశాను. అదే స్నేహానుబంధానికున్న మహోత్కృష్టమైన, అనిర్వచనీయమైన మాధుర్యం! అది మాటల్లో చెప్పలేనిది!!

కొన్నాళ్లుగా వేదనతో బరువెక్కిన నా గుండెలకు ఇప్పుడు కాస్త ఊరట చేకూరింది. ఈరోజు నా స్నేహితుడు నాతోనే వున్నాడు. అది చాలు నాకు.

ఒక స్నేహితుడు.. ఒక ధైర్యం, ఒక భరోసా!" అన్నాడు విష్ణుమూర్తి తేలికపడ్డ హృదయంలో అవ్యాజమైన స్నేహపూర్వక ప్రేమైక దైవతత్వాన్ని పరిపుష్టం చేసుకుంటూ!

# తెలంగాణ పత్రికా రంగంలో తిరుగుబాటు చైతన్యం

జయసూర్య

**అసఫ్‌జాహీల** పాలనా కాలానికి ముందు పార్సీ, తరువాత ఉర్దూ రాజభాషగా రాజ్యాధికారపు శతాబ్దాల రోజులలో కేవలం నాలుగు శాతం అక్షరాస్యత వున్న నైజాం సంస్థానంలో 1921లో నైజమాంధ్ర జనసంఘం స్థాపన సమయంలో తెలుగు భాషాభిమానంగా పత్రికా రంగం ప్రవేశించింది. తొలి దశ 7వ నిజాం కాలంనాటి ఆ రోజులలో తెలంగాణ పునరుజ్జీవనం నాందిగా పుస్తక పఠనం, తెలుగు చదవడం రాయడం వ్యాప్తి చేసే చైతన్యంలో భాగంగా నాటి పెద్దలు గ్రంథాలయోద్యమాన్ని చేపట్టారు. అంతకుముందే గద్వాల, వనపర్తి వంటి సంస్థానాలలో తెలుగు సాహిత్యానికి, కవిపండితులకు, రచనలకు విశేష ఆదరణ లభించేది. పత్రికోద్యమం 1864 నాటికే ఆంగ్లపత్రిక 'దక్కన్ టైమ్స్'తో ప్రారంభమై, 1890 నాటికి తెలంగాణలో ఉర్దూ, ఆంగ్ల భాషలలో 21 వార్తాపత్రికలు వచ్చాయి. 1886లో 'శేద్యచంద్రిక', 1913లో 'హితబోధిని', 1922 నాటికి 'నీలగిరి', 'తెనుగు', 'గోలకొండ'(1925), 'దేశబంధు'(1926), 'సుజాత'(1927), ఆధునికతా వ్యాప్తికి, తెలుగు భాషోద్యమానికి, ప్రజాపాలనా సంస్కరణాయుత చైతన్యానికి, పోరుబాటలో ముందుకు సాగాయి. గద్వాల సంస్థానాధీశుడు సీతారామ భూపాలుడు 1827లో మద్రాస్‌లో సి.పి.బ్రౌన్‌ను కలిసిన తర్వాత బహుశా తొలి ముద్రణాశాల ప్రారంభమైంది. ఆ తర్వాత వనపర్తి సంస్థానంలో, హైదరాబాద్‌లో ముద్రణాశాలలు రావడంతో గ్రంథాలయోద్యమం పత్రికోద్యమం పరస్పర పోషకంగా రాజకీయ, సామాజిక చైతన్యం వెల్లివిరిసింది. మహబూబ్‌నగరం నుండి శ్రీనివాస శర్మ హితబోధిని, సికిందరా బాద్ నుంచి స్వామి వెంకటరావు ఆంధ్రమాత ప్రచురణలు ఏడాది, ఎనిమిది నెలలు మాత్రమే నడిచాయి.

తెలుగు మీద అంతగా అభిమానం లేని రోజులవి. వరంగల్లు జిల్లా మానుకోట తాలుకా ఇనుగుర్తి దేశ్‌ముఖ్‌లు ఒద్దిరాజు సోదరులు సీతారామచంద్రరావు, రాఘవ రంగారావు మద్రాస్‌లో కాశీనాథుని, బందరులో కృష్ణారావును కలుసుకొని పత్రికా నిర్వహణలో కష్ట, నష్టాలను తెలుసుకొన్నారు. అప్పటికే వారు ప్రాచీన ఆధునిక ప్రక్రియలలో సాహితీ వైతాళికులలో ప్రముఖులుగా పేరు పొందారు. రాజకీయ వార్తల విషయంలో నైజాం ప్రభుత్వ ఆంక్షలు పట్టించుకోకుండా 'తెనుగు' వారపత్రిక ప్రారంభించారు. వాళ్ల ఇంటిని రజాకార్లు తర్వాత కాల్చివేయడంతో ఎంతో సాహిత్యం, రచనలు కనుమరుగయ్యాయి.

నిజాం పాలనా కాలం తెలుగుకు, అంధయుగమైంది. నాడు తెలంగాణలో తొలి దశలో నల్లగొండ నుండి నీలగిరి వారపత్రికగా 24.8.1922న షబ్నవీసు వెంకటరామ నరసింహారావు స్థాపించారు. 'షబ్నవీసు' అంటే చీకటిలో కూడా రాయగలగినవారు అని అర్థం. ఏ వెలుగూ లేని కాలంలో 'షబ్నవీసు' పత్రికా రంగంలో చిరుదివ్వెను వెలిగించారు. ఆ రోజులలో 'చలం' రాసిన కథను ప్రచురించడానికి ఇతర పత్రికలు భయపడుతుంటే 'నీలగిరి'లో ప్రచురించిన ఘనత దక్కించుకొన్నారు. 'నీలగిరి' పత్రిక ప్రారంభ సంచిక ప్రయత్నంలో ఉండగానే భార్య జానకీబాయి మరణం కుంగదీసినా, అనుకొన్న సమయానికి తన భార్య స్మృతి సంచికగా వెలువరించారు. 'నీలగిరి' వెలువడిన నాలుగో రోజునే ఒద్దిరాజు సోదరులు 'తెనుగు' వారపత్రికను 1922లో ఇనుగుర్తి నుంచి ప్రారంభించారు. శేషాద్రి రమణకవులు, గంగుల సాయిరెడ్డి, రాయప్రోలు వంటి ప్రముఖులెందరో 'తెనుగు' పత్రికకు రచనలు చేసేవారు. 'నీలగిరి' ఆంధ్ర మహాసభ విశేషాలను నిర్భయంగా ప్రచురించేది. తెలుగు, ఉర్దూ భాషలలో నిష్ణాతులైన రామనరసింహారావు సాహసవంతులైన పత్రికా సంపాదకులు. బూర్గుల, మాడపాటి వంటి పెద్దలు నీలగిరిలో వ్యాసాలు రాసేవారు. తెలంగాణసీమలో ఆంధ్రోద్యమం అంకురించి ప్రభావితం చేస్తున్న సమయం అది.

తెలుగుభాషకే ఎటువంటి గుర్తింపు లేని ఆ రోజులలో తెలుగు పత్రికల నిర్వహణ అసిధారా వ్రతంగా వుండేది. అధికారులు అనుమతి యిచ్చినా, ప్రజా చైతన్యం వెల్లివిరుస్తుందని మీర్ ఉస్మాన్ అలీఖాన్ భయపడేవాడు. 1921లో నైజాం ప్రభుత్వం భావ ప్రకటనా స్వేచ్ఛకు సంకెళ్లు తొడిగే 'గస్తి' నం.53 నిబంధన విధించింది. 1947 నైజాం పతనం వరకు ఆంక్షలతో ఫర్మానాలు జారీ చేస్తూనే వుంది.

నైజాం వ్యతిరేక పోరులో ఆర్య సమాజం పత్రికా సమరం చేపట్టింది. 'వైదిక ఆదర్శ్' ఆర్య సమాజ్ పత్రిక. రహబరే దక్కన్, సబహే దక్కన్ నిజాం సర్కార్ పోషణలోని పత్రికలు. ఆ రెండింటి విమర్శలను 'వైదిక ఆదర్శ్' ఖండించేది.

1920–1940 మధ్య తెలంగాణ సీమలో దాదాపు 45 పత్రికలు వెలువడ్డాయి. తొలితరం పత్రికలు చిరకాలం ప్రచురణకు నోచుకోకపోయినా, నిజాం రాజ్యంలో 8 దశాబ్దాల తరువాత ఓరుగల్లు సామ్రాజ్యానంతరం అజ్ఞా నాంధకారం నుంచి తెలంగాణను మేలుకొలిపి వైజ్ఞానిక, సాంఘిక, రాజకీయ చైతన్యం రగిలించాయి. 'గోలకొండ' పత్రికను సురవరం ప్రతాపరెడ్డి 1925 మే 10న హైదరాబాద్‌లో స్థాపించారు. 'దివ్యవాణి'ని చివుకుల అప్పయ్యశాస్త్రి, భాగ్యనగర్‌ను, భాగ్యరెడ్డి ప్రారంభించారు. 'భాగ్యనగర్' పదిహేనేళ్లు వెలువడింది. 1938 ప్రాంతంలో బి.ఎన్.శర్మ విజయవాడ వెళ్ళి 'ఆంధ్రవాణి', 1940–1944 పత్రికా రంగం చరిత్రలో విశిష్టమైన 'మీజాన్' అడవి బాపిరాజు, విద్వాన్ విశ్వం, తిరుమల రామచంద్ర, శ్రీనివాస శిరోమణి, రాంభట్ల కృష్ణమూర్తి ఇలా ఎందరో సేవలందించారు. 1944లో పాములపర్తి సదాశివరావు కాకతీయ వెలువరించారు. 1942–1948 మధ్య సంవత్సరాలలో నీలగిరి, తెనుగు, గోలకొండ మూడు పత్రికలు సృష్టించిన చైతన్యవంతమైన తిరుగుబాటు పునాదిగా తెలంగాణ పత్రికా రంగం వెలుగుదివ్వెలు వెలిగించింది.. విప్లవ చైతన్యం రగిలించింది.



# కుక్కకున్న సద్గుణాలు

యామిజాల జగదీశ్

**"మీకు దేవుడంటే భక్తి ఉందా?" అని అడిగారు ఒకరిని.**

**"ఉంది" అన్నారు ఇంకొకరు.**

**"అలాగైతే కుక్కకున్న సుగుణాలన్నీ మీలోనూ ఉండాలన్నారు" మొదటి వ్యక్తి.**

**"దేవుడంటే భక్తి ఉందన్న" వ్యక్తికి ఈ మాట ఒకింత ఆశ్చర్యపరిచింది... విస్మయపరిచింది. ఆలోచనలో పడేసింది.**

"మీరు చెప్తున్నది అర్థం కాలేదు. ఏమిటండీ ఇలా చెప్పారు.. ఎందుకని?" అని అడిగారు ఆ మనిషి.

"అయ్యో, నేను మిమ్మల్ని హేళన చేస్తున్నానని అనుకోకండి. ఓ పుస్తకం చదివాను. అందులో హసన్ బసరీ(రహ్) అలా చెప్పారు.

"కుక్కకంటూ పది సద్గుణాలు ఉన్నాయి. ఆ పది గుణాలు దైవభక్తి ఉన్నవారిలోనూ ఉండటం తప్పనిసరి" అని ఆయన చెప్పారు.

"సరే.. బాగానే ఉంది. కుక్క దగ్గరున్న ఆ పది గుణాలేమిటండీ?"

"మొదటిది: అది ఆకలితో ఉంటుంది. ఆకలి వేయడం అనేది మంచివాళ్లకున్న గుణాలలో ఒకటి. దేవుడి పట్ల ఆకలి అనే భక్తి ఎట్టి పరిస్థితుల్లోనూ తరిగిపోకూడదు.

రెండు: అది నివసించడానికి అంటూ ప్రత్యేకించి ఓ చోటు ఉండదు. ఇది సామాన్యమైన గుణం కాదు. భగవంతుడి దృష్టి పొందినవారి గుర్తు ఇది.

మూడవది: అది రాత్రిపూట కాస్సేపే నిద్ర పోతుంది. దేవుడంటే ప్రియంగా ఉండేవారిలోనూ ఈ గుణం ఉంటుంది.

నాలుగవది: అది చనిపోతే తర్వాత చూద్దాంలే అనేది ఉండదు. అది సాధువుల గుర్తు.

అయిదవది: యజమాని ఎన్ని సార్లు కొట్టి తరిమినా అది అతనికి దూరమవదు. అసలు సిసలైన ఆధ్యాత్మికవాదులకు ఉండవలసిన గుణమిది.

ఆరవది: అది భూమి మీద అణకువతో ఉంటుంది. ఇది మనిషికి ఉండవలసిన సద్గుణం.

ఏడవది: కుక్క, దాని చోటుని ఇంకొకటి ఆక్రమిస్తే అది మరో చోటుకు వెళ్లి పడుకుంటుంది. భగవద్భక్తి ఉన్న వారికి ఉండవలసిన సద్గుణం.

ఎనిమిదవది: ఎన్ని సార్లు తరిమినా కొట్టినా దానికో రొట్టెముక్క చూపిస్తే అంతక్రితం తిన్న దెబ్బలను మరచిపోయి స్నేహంతో చెంత చేరుతుంది. అది భక్తుల సద్గుణం.

తొమ్మిదవది: ఆహారాన్ని చూస్తే అది దూరంగా కూర్చుని చూస్తుంది. అది పేదల సద్గుణం.



పదవది: అది ఓ చోటును విడిచిపెట్టి వెళ్లిపోతే మళ్లీ ఆ చోటును తిరిగికూడా చూడదు. ఇది విచారంతో ఉన్నవారి గుణం.

మొత్తంమీద కుక్క దగ్గర ఉన్న ఈ గుణాలను మనిషిలోని మంచివాళ్లు తెలుసుకుని అలవరచుకోవలసిన మంచి గుణాలు ఉన్నాయో, లేవో చెప్పండి".

కానీ మనం ఏం చేస్తాం?

ఇతరులను తిట్టడం కోసమే కుక్క అనే మాటను ఉపయోగిస్తున్నాం. అతనితో మాట్లాడకు.. కుక్కలా మొరుగుతాడు, పైన పడి కరుస్తాడు అని చెప్పడం కద్దు.

.......

అనగనగా ఒక వ్యక్తి అనేక రకాల కుక్కపిల్లలను పెంచాడు. అవి ఒక్కొక్కటీ ఒక్కో జాతికి చెందినవి. వాటిలో విదేశీజాతి కుక్కలు సైతం ఉన్నాయి. వాటిని ఇంటిలోపలే ఉంచి చూసుకునేవాడు. ఒక్కొక్కప్పుడు వాటిని అమ్ముతుండేవాడు. ఆయన దగ్గర ఓ కుక్కపిల్లను కొనడానికి ఒకడు వెళ్లాడు.

"సార్, మంచి జాతి కుక్కపిల్ల ఒకటి కావాలి. యజమాని పట్ల ఎక్కువ విశ్వాసం ఉండాలి. ఎప్పుడూ అది నన్ను విడిచిపెట్టి పోకూడదు. అటువంటి మంచి గుణాలున్న కుక్కపిల్ల కావాలి. అది మీ దగ్గరుంటే ఇవ్వండి.. డబ్బులిస్తాను" అన్నాడు.

"అలాగా.. అయితే మీకు కుడి వైపున అదిగో అక్కడ కట్టి వుంచాను. నల్లగా ఉంది చూసారూ.. ఆ కుక్కపిల్లను తీసుకుపోండి" అన్నాడు దుకాణదారు.

"అలాగా, దానికి యజమాని అంటే అంత విశ్వాసమా?" అని అడిగాడు కుక్కపిల్లను కొనడానికి వచ్చిన వ్యక్తి.

"అవునండీ.. పెంచుకునేవారి దగ్గర ఎంతో ప్రియంగా ఉంటుంది, ఎక్కడికీ పోదు" అన్నాడు దుకాణదారు.

"ఈ మాట మీరెలా అంత రూఢీగా చెప్పగలుగుతున్నారు?" అని అడిగాడు కొనడానికి వచ్చినతను.

"ఇప్పటివరకూ ఈ కుక్కపిల్లను ఏడుగురికి అమ్మాను. వారు తీసుకుపోయిన మరుసటి రోజే నా దగ్గరకు పరిగెత్తుకుంటూ వచ్చేస్తుంది" అన్నాడు దుకాణదారు చల్లగా. ✦

# బొమ్మల్లో యువరాణి 'బార్బీ'

తరిగొప్పుల వి.ఎల్లెన్ మూర్తి

**చిన్నారులు ఆడుకునే బొమ్మల్లో బార్బీబొమ్మలది ప్రత్యేక స్థానం. ముచ్చటగా కనిపించే బార్బీ డాల్స్‌ను చిన్న పిల్లలు ఎంతగానో ఇష్టపడతారు. వాటికి మంచి మంచి డ్రెస్సులు, హెయిర్ స్టైల్స్, మేకప్ వేసి మురిసిపోతుంటారు. ఆ బొమ్మలకు తమకు నచ్చిన డ్రెస్సు వేసి తెగ సంబరపడిపోతారు. బొమ్మల్లో బార్బీది ప్రత్యేక స్థానం. అందులోనూ అమ్మాయిలకు బార్బీ అంటే ప్రాణం.**

ముచ్చటగా కనిపించే ఈ అమ్మాయి బొమ్మను పిల్లలు ఎంతో ఇష్టపడతారు. ఆ బొమ్మకు వారే హెయిర్ డ్రెస్సర్లు. బార్బీ ప్లాస్టిక్ జుట్టును ఇష్టం వచ్చిన రీతిలో ముడులు వేసి మురిసిపోతుంటారు. తమకు నచ్చిన డ్రెస్సులు తగిలించి కేరింతలు కొడతారు.

ప్రపంచంలో అత్యంత ప్రాచుర్యం పొందిన బొమ్మలలో బార్బీ ఒకటని చెప్పేందుకు ఏమాత్రం ఆలోచించాల్సిన అవసరం లేదు. చిన్న పిల్లలను ముఖ్యంగా అమ్మాయిలను ఎంతగానో ఆకట్టుకునే ఈ బార్బీబొమ్మకు ఇటీవల 60 ఏళ్లు నిండాయి.

ఇన్ని ఏళ్లలో బార్బీబొమ్మ వ్యోమగామిగా, ఫైర్ ఫైటర్‌గా, గేమ్ డెవలపర్‌గా, అమెరికా ప్రెసిడెంట్‌గా ఇలా ఎన్నో విధాలుగా రూపాంతరం చెందింది. అయితే తెలుపు రంగు, సన్నని శరీరంతో వస్తోన్న ఈ బొమ్మపై పలువురు కామెంట్లు చేస్తూ వచ్చారు.

అయితే, బొమ్మల ప్రపంచంలో మ్యాచింగ్ కొత్త ట్రెండే కావచ్చు, కానీ పిల్లలకీ, బొమ్మలకీ కలిపి మ్యాచింగ్ దుస్తులు రావడం మాత్రం మినీ బార్బీ బొమ్మలతోనే మొదలైందని చెప్పాలి. అచ్చంగా అమ్మాయి పోలికలతోనే బొమ్మని తయారుచేసి ఇద్దరికీ మ్యాచింగ్ దుస్తుల్ని తయారు చేసిందా కంపెనీ. అది మొదలు అనేక కంపెనీలు బొమ్మలకీ పిల్లలకీ దుస్తులు కలిపి తయారు చేయడం ప్రారంభించాయి. కానీ తల్లిబొమ్మకీ పిల్లబొమ్మకీ మ్యాచింగ్ దుస్తులు డిజైన్ చేయడం మాత్రం ఇప్పుడిప్పుడే మొదలవుతోంది. సో, మున్ముందు బొమ్మల కుటుంబాలూ రకరకాల మ్యాచింగ్ దుస్తులతో కొలువు దీరనున్నాయన్నమాట.

బార్బీ అసలు పేరు 'బార్బీ మిలిసెంట్ రాబర్ట్స్'. జర్మనీ దేశానికి చెంది బిల్డ్‌లిల్లీ అనే బొమ్మ 1959వ సంవత్సరం మార్చి 9వ తేదీన జరిగిన ఓ ఆటబొమ్మల ప్రదర్శనలో బార్బీ బొమ్మగా ప్రపంచానికి పరిచయమైంది. ఆ తరువాత ఈ బొమ్మ ప్రపంచ దేశాలన్నింటికీ పాకింది. అత్యంత ప్రసిద్ధ డాల్‌గా మారింది.

గడచిన ఏళ్లలో బార్బీ వివిధ రూపాలలో వినూత్న ఆహార్యాలతో పిల్లలను అలరించిన సంగతి విదితమే.

బొమ్మల ప్రపంచంలో బార్బీ ఓ సంచలనం, అయితే దాన్ని దేశాలకీ ప్రాంతాలకీ అనుగుణంగా విభిన్న వేషధారణల్లో తయారు చేయడంతో అది మరింత క్రేజీగా మారింది. దాంతో బొమ్మల తయారీదారులే కాదు, బొమ్మలంటే ఇష్టమున్నవాళ్లూ భారతీయ బార్బీ బొమ్మల కోసం చీరె, లెహంగా, సల్వార్, పటియాలా, పలాజో, అనార్కలీ.. ఇలా అనేక దుస్తుల్ని డిజైన్ చేసి అలంకరించేస్తున్నారు. పైగా వాటిని అచ్చం అమ్మాయిల కోసం రకరకాల ఎంబ్రాయిడరీలతో డిజైన్ చేసినట్లే చేస్తున్నారు. దూరం నుంచి చూసేవాళ్లకు అసలివి బొమ్మలా లేక మనుషులా అనిపించేంత అద్భుతంగా ఆ బట్టల్ని కుట్టేస్తున్నారు డిజైనర్లు.

డ్రెస్సుకి తగ్గట్టే నగల్నీ డిజైన్ చేస్తున్నారు. అక్కడితో ఆగితే చెప్పుకునేదేముంది! అమ్మాయి బొమ్మకి ఇప్పుడు పాపాయి బొమ్మని జతచేసి మ్యాచింగ్ డిజైనర్ దుస్తుల్నీ తయారు చేస్తోంది మాయా క్రాఫ్టీవర్క్స్. ఏ పెళ్లివేడుకకో తల్లికూతుళ్లిద్దరూ కలిసి వెళుతున్నట్టున్న ఈ బొమ్మలు చూపరుల కళ్లను కట్టిపడేస్తున్నాయి.

తొలిసారి యు.ఎస్.కు చెందిన బొమ్మల కంపెనీ 'మాటెల్' బార్బీ బొమ్మను తయారు చేసి 'న్యూయార్క్ టాయ్ ఫెయిర్'లో ప్రదర్శనకు పెట్టింది. రూథ్ హాండ్లర్ అనే వ్యాపారవేత్త బార్బీ సృష్టికర్త. ఈ బొమ్మకు బిల్డ్ లిల్లీ అనే జర్మన్ బొమ్మకు చాలా పోలికలు ఉన్నాయి. ఈ బొమ్మకు తిరుగులేకుండా పోయింది. దేశ దేశాల పిల్లలకూ ఇష్టురాలైపోయింది. మొదట తయారు చేసిన బార్బీ నలుపు, తెలుపు స్విమ్ సూట్‌లో ఉంటుంది. ఈ బొమ్మ 11.5 అంగుళాల ఎత్తుంటుంది.

ఇలా ప్రారంభమైన బార్బీ ప్రస్థానం ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా సెకనుకు రెండు అమ్ముడు పోతాయట. అంటే రోజుకు 1,72,800 అన్నమాట!



ప్రపంచ వ్యాప్తంగా బార్బీ బొమ్మలు సేకరించేవారి సంఖ్య లక్ష దాకా ఉంటుంది. టీచర్ బొమ్మ నుంచి పారిశ్రామికవేత్త వరకు దాదాపు 150 రకాలుగా బార్బీ బొమ్మ అవతారాలెత్తింది.

అంతేకాదు, బార్బీ బొమ్మను 1965లోనే అంతరిక్షంలోకి పంపారు. ప్రపంచవ్యాప్తంగా బార్బీ బొమ్మలు సేకరించేవారి సంఖ్య లక్షదాకా ఉంటుందంటే నమ్మగలరా? అయితే వాళ్లందరిలో జర్మనీకి చెందిన 'బెట్టినా డార్ఫ్‌మన్'కు ఎక్కువ బార్బీ బొమ్మలున్న వ్యక్తిగా గిన్నిస్ రికార్డు దక్కింది. ఈమె 15000 బొమ్మలను సేకరించింది. పైగా బార్బీ క్లినిక్ పేరుతో పాత బొమ్మలను బాగు చేసే ఒక ఆసుపత్రిని కూడా పెట్టింది. బెట్టినా 1966 నుంచి బార్బీ నుంచి బార్బీ బొమ్మల్ని సేకరిస్తూనే ఉందిట.

గత ఏడాది బెల్జియంకు చెందిన కళాకారిణి అన్నెట్టేథాస్ సముద్ర తీరంలో 3000 బార్బీ బొమ్మలతో అల ఆకారం వచ్చేలా కళాఖండం చేసింది. ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ నగల వ్యాపార సంస్థ స్టెఫనో కంటూరి ఖరీదైన వజ్రాల నెక్లెస్‌ను ధరించిన బార్బీ బొమ్మను వేలానికి పెట్టింది. న్యూయార్క్‌కు చెందిన ఒక చారిటీ సంస్థ కోసం ఈ వేలాన్ని ఏర్పాటు చేశారు. ఈ బొమ్మ వేలంలో అక్షరాల 3,02,500 డాలర్లు పలికింది. దీంతో ప్రపంచంలోనే అత్యధిక ధర పలికిన బార్బీ బొమ్మగా ఇది రికార్డు సొంతం చేసుకుంది.

నగల తయారీ సంస్థ చూపుడు వేలు మందంతో కూడుకున్న నెక్లెస్‌ను వజ్రాలు పొదిగి తయారు చేసింది. దీన్ని మూడు క్యారెట్ల తెలుపు వజ్రాలు, ఒక క్యారెట్ పింక్ వజ్రంతో తయారు చేయడం విశేషం. 2006లో కూడా ఒకసారి బార్బీ బొమ్మను వేలం వేయగా దానికి పిలికిన ధర 16,980.74 డాలర్లు. అప్పట్లో అదే అత్యంత ఖరీదైన బార్బీ బొమ్మ. డ్రస్ ఏదైనా బార్బీ బొమ్మలు ముచ్చటగా కనిపిస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా 'బార్బీ' డాల్స్‌కున్న క్రేజ్ అంతా ఇంతా కాదు. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఈ బొమ్మలను ఇష్టపడతారు. అందమైన అమ్మాయిలను ప్రతిబింబించేలా చూడముచ్చటగా బార్బీ సంస్థ ఈ బొమ్మలను రూపొందిస్తోంది. అయితే సంస్థ తయారు చేసే ప్రతి బొమ్మ



వెనక ఒక నేపథ్యం ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా ట్రెండ్ అవుతోన్న లేటెస్ట్ ఫ్యాషన్స్‌ను ప్రతిబింబించేలా బొమ్మలను రూపొందించే బార్బీ సంస్థ ఈసారి సరికొత్త థీమ్‌తో ముందుకొచ్చింది.

తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు ధైర్యంగా, సాహసోపేతంగా ముందుకు సాగే



మహిళలను ప్రతిబింబించే విధంగా బార్బీ బొమ్మలను రూపొందించింది. బాలికలు, మహిళల్లో స్ఫూర్తి నింపేందుకు రష్యన్ మహిళా 'కాస్మోనాట్-అన్నా-కికినా' రూపంలో బార్బీ బొమ్మను తయారు చేసింది.

## బార్బీకి ప్రాణం వస్తే!?

అందమైన బార్బీ బొమ్మకు ప్రాణం వస్తే! ఈ మధ్య కొంత మంది అమ్మాయిలు తమని తాము బార్బీ బొమ్మలాగా తయారు చేసుకుంటున్నారు. ఇది యూక్రైన్ దేశ మహిళల్లో ఎక్కువగా కనిపిస్తోంది. మాస్కో నగరంలోని ఏంజెలికా కినోవాను ప్రత్యేకంగా పెంచారు అచ్చం బార్బీ బొమ్మలా! ఆమె హెయిర్ స్టైల్, డ్రెస్సింగ్ అంతా తల్లిదండ్రులే నిర్ణయిస్తారు. ఒకవేళ కినోవా బయటికి వెళ్లాల్సి వస్తే తల్లి వెంట ఉండాల్సిందే. చిన్నప్పటి నుండి తనను ఓ యువ రాణిలా పెంచారని ఈ 'లివింగ్ బార్బీ' తెలిపింది. తాను బతికున్న బార్బీనని చెప్పుకొచ్చింది.

26 ఏళ్ల రష్యా అమ్మాయి వాలెరియా లుక్యానోవ మాత్రం అచ్చం బార్బీలాగే పెరిగింది. ఈమె జీవం ఉన్న బార్బీలాగే కనిపిస్తుంది. 1985లో ఉక్రెయిన్‌లో పుట్టింది. ఎత్తు 5.7 అడుగులు, బరువు 42 కిలోలు. వలేరియా లుక్యనోవా 2007లో అందాల పోటీల్లో పాల్గొని మిస్ డైమండ్ క్రౌన్ ఆఫ్ వరల్డ్ కిరీటం దక్కించుకుంది. లివింగ్ బార్బీగా గుర్తింపు సంపాదించింది. బార్బీగా కనిపించేందుకు లెన్స్ వాడుతోంది. బార్బీలాగా శరీర సౌష్టవం కనిపించేందుకు ప్రతినిత్యం జిమ్ముకు వెళ్లాల్సిందే. పింక్ కలర్లో ఉండే సింథటిక్ దుస్తులే వేసుకుంటుంది.

కాలిఫోర్నియాకు చెందిన మరో ముద్దుగుమ్మ.. అంబర్ గుజ్‌మన్. వయసు 28 ఏళ్లు. కండరాల వ్యాధితో బాధపడుతోంది. అందరిలా ఎక్కువ దూరం నడవలేదు, ఎక్కువగా తినలేదు. తన 18వ ఏట ఆమె ఈ వ్యాధి బారిన పడింది. ఈ వ్యాధికి సరైన ట్రీట్‌మెంట్ లేక ఇలా బొమ్మలా తయారైంది. వర్జీనియాలో జరుగుతున్న నేషనల్ బార్బీ డాల్ కలెక్టర్స్ కన్వెన్షన్ నేపథ్యంలో ఈ బార్బీ బొమ్మ విషయం వెలుగులోకి వచ్చింది.

## సేకరణ చాలా ఖరీదు

సింగపూర్ కుర్రాడు జియాన్ యాంగ్ ఇంట్లోకి అడుగు పెడితే ఆరు వేల బార్బీలు మనల్నే చూస్తుంటాయి. గోడలు, గ్లాస్ అల్మారాలు, ఉడ్ షెల్ఫ్‌లు.. అన్నీ బార్బీలు, ఇతర బొమ్మలతో నిండిపోయి కనిపిస్తాయి. పదమూడేళ్ల వయసులో కొన్న తొలి బార్బీ నుంచి ఇప్పటివరకూ తొమ్మిది వేల బొమ్మలు కొనేశాడు. ఇంతకూ యాంగ్ బొమ్మల కొలువు విలువెంతో తెలుసా.. జస్ట్ ఐదు లక్షల డాలర్లు.

# శబ్దం, నిశ్శబ్దం.. భగవాన్ వరాలు

డా॥ పులివర్తి కృష్ణమూర్తి

**వినడం ఒక కళ అన్నారు. ఎంత మంచిగా చెప్పినా విననివారు ఎందరో ఉన్నారు. కొంత మంది ఎంత చెప్పినా, ఎలా చెప్పినా వారి నోట పలికిన పలుకులు మధురంగా వినసొంపుగా తోచి, మనస్సుకు ఎంతో హాయిని కలిగిస్తాయి. ఆ ధ్వనిలో అంతటి మహత్తు ఉంది. కోకిల గానం వినసొంపుగా ఉంటుంది. కాకి అరుపులు అదోలా అనిపిస్తాయి. హంసల కూజితాలు మధురంగా ఉంటాయి. మరి గాడిదల అరుపులు చెవులకు బాధ కలిగిస్తాయి.**

కొన్ని ధ్వనులు, అంటే సింహ గర్జనలు, ఏనుగుల ఘీంకారాలు భయాన్ని కలిగిస్తాయి. అంతేకాదు.. మేఘుడూ ఘర్జిస్తే భీతిని పొందుతాం. కొన్ని ధ్వనులు మనకు హాయిని కలిగిస్తే, మరికొన్ని భయాన్ని కలిగిస్తాయి. అయినా అయిష్టంగానే వింటూ వుంటాం. మనకు ఇష్టమైన గానం వినిపిస్తే ఆనంద పడుతూ మరీ మరీ వింటుంటాం. కొన్ని భజనల్లో కీర్తనలు మనిషికి మానసిక ప్రశాంతతను కలిగిస్తాయి. సెలయేళ్ల చేసే ధ్వనులు కొందరికి ఎంతగానో నచ్చుతాయి. పర్వత శ్రేణుల్లో విహరిస్తూ ఉన్నప్పుడు వీచే గాలుల్లో ఏదో తెలియని అనుభూతి కలుగుతుంది. మీరెప్పుడైనా అడవి మార్గాల్లోని చెట్ల మధ్యన నడుస్తూ వెళ్తుంటే, దారిలో కింద పడి వున్న ఎండుటాకులు చేసే ధ్వని గమనించారా? అది మీతోనే మీ వెంటే వస్తుంది. మనస్సుకు ఒక వింత హాయిని కలిగిస్తాయి. అలాగే కొన్ని కీటకాలు చేసే వివిధ రకాల ధ్వనులు సైతం కొత్త అనుభూతిని కలిగిస్తాయి. తుమ్మెదల ఝుంకారం కూడా అంతే తియ్యగా అనిపిస్తుంది వినడానికి.

ఇక సంగీతం విషయంలోనూ మనిషికేగాక జంతువులకు కూడా ఆనందం కలుగుతుంది. కొన్ని రాగాలు వింటే కొందరికి సంతోషం కలిగి కనుల వెంట అప్రయత్నంగా కన్నీటి ధారలు ప్రవహిస్తుంటాయి. కొన్ని రాగాలు ఆనందాన్ని కలిగిస్తే, మరికొన్ని బాధను కలిగిస్తాయి. కొన్ని వింటే మనలో ఉత్తేజం కలుగుతుంది. కొన్ని మనకు ఏదో బోధిస్తున్నట్లుగా అనిపిస్తాయి. ఆ ధ్వనులలో అంతటి శక్తి ఉంది.

మనిషి నోటి నుండి వెలువడే శబ్దాలకు, ధ్వనులకూ జీవులు ఎంతగానో స్పందిస్తారు. అంతటి శక్తి వుంది ధ్వనులలో. దేనికైనా ఒక పరిమితి ఉంటుంది. దాన్ని దాటితే భరించడం చాలా కష్టంగా ఉంటుంది. నిశ్శబ్దం ధ్వని రహితం. ఒక విధంగా అది కూడా మానసిక శాంతిని కలిగిస్తుంది. మౌనంగానే మునులూ, ఋషులూ తమ తపస్సును సాగిస్తారు. ప్రకృతి ఎప్పుడూ తన ధ్వనులు తాను చేస్తూనే ఉంటుంది. అది సహజం. మనకు ఇష్టమైనవారు మాట్లాడుతుంటే వినసొంపుగా వుంటుంది. మనకు ఇష్టం వున్నా లేకపోయినా ముద్దు ముద్దుగా మాట్లాడే పిల్లల పలుకులూ, చిలుక పలుకులూ విని తీరాల్సిందే. అవి మనకు తెలియని ఏదో అనుభూతికి లోను గావిస్తాయి.

ఈ ప్రకృతి మనకు అందించిన ఒక అద్భుతమైన కళ ధ్వని సౌందర్యం. ఎంతటి కఠినాత్ముడినైనా ఇట్టే మార్చి సన్మార్గంలో నడిపించగల శక్తి శబ్దానికి వుంది. ఏ ధ్వనినైనా, శబ్దాన్నైనా వినగలగాలి.



అలా వినలేనివారు మనకు ఈ ప్రపంచంలో ఎందరో కనిపిస్తారు. వారి భాషే వేరుగా ఉంటుంది. వారు మనతోనే మాట్లాడుతుంటారు. మనస్సులో తమ మాటలు వినిపిస్తాయి. ఆ ధ్వని తరంగాలకు శబ్దం వుండదు. నిశ్శబ్ద భాషలోనే వారి సంభాషణలు సాగుతాయి.

దైవలీలలు అద్భుతం. మౌన భాషలోనే ధ్వని రహితంగా వారు సంభాషిస్తారు. మహర్షులూ, మహాత్ములూ ఆ విధంగానే ధ్వని రహిత సంభాషణం సాగించేవారు. శబ్దం, నిశ్శబ్దం అంతా ఆ భగవంతుని ప్రసాదమే. ప్రకృతి మనకు ప్రసాదించిన పంచ భూతాత్మకమైన ఒక వరం. ◆


## సరదా రచనలకు ఆహ్వానం

జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి. మీ రచనలు పంపించవలసిన చిరునామా:

నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.

sunmagvaartha@gmail.com

# వారఫలం



శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



పెద్ద స్థాయి కలిగిన వ్యక్తులు కూడా చిన్న చిన్న పనులు చేసుకోవలసి వస్తుంది. పెట్టుబడి ఖర్చు, అభివృద్ధికి, భవిష్యత్ ప్రణాళికలకు ఉపయోగపడుతుంది. సన్నిహితులకు, కుటుంబ సభ్యులకు మీ శ్రమ మాత్రమే కనిపిస్తుంది. కొంత మంది విదేశీ ద్రవ్యం విశేషంగా ఆర్జిస్తారు. దుష్ప్రచారాల వల్ల మానసిక ప్రశాంతత దూరమవుతుంది.

## వృషభం



అడ్వాన్స్‌గా ఇచ్చిన ధనం తిరిగి రావడం కష్టమవుతుంది. కంప్యూటర్ ఇంజినీర్స్‌కు బాగుంటుంది. స్త్రీలకు శుభ యోగం. అవివాహితులైన స్త్రీలకు వివాహ యోగం. రాజకీయ అధికారం, విదేశీ విద్యా సంబంధిత అవకాశాలు కలిసి వస్తాయి. వాహన ప్రాప్తి. సంతానం వలన సంఘంలో కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. అయితే వ్యక్తిగతంగా అసంతృప్తికి లోనవుతారు.

## మిథునం



సహోదర-సహోదరీ వర్గీయులు కొన్ని కారణాల వల్ల దూరంగా ఉంటారు. భాగస్వాముల్లో గల నిజాయితీపరులు, ధనబలం గలవారు తొలగిపోయే అవకాశాలున్నాయి. సంతానం స్థిరపడకపోవడం అసంతృప్తిగా వున్నా ఉద్యోగంలో పదోన్నతికి అనుకూలమైన సమయం. వివాహాది శుభ కార్యాల విషయంలో తీవ్ర వత్తిడికి లోనైనా తరువాత సానుకూలం.

## కర్కాటకం



విదేశీయాన ప్రయత్నాలు, కంప్యూటర్ విద్య, తత్సంబంధమైన వాటి ప్రయత్నాలు ఫలిస్తాయి. ఒక శుభవార్త వింటారు. కుటుంబ సభ్యులతో దేవాలయం సందర్శిస్తారు. గృహాలంకరణకు ధనం ఖర్చు చేస్తారు. వాణిజ్య ప్రకటనలకు, ఇంటర్వ్యూలకు అనుకూల సమయం. నూతన వ్యాపార యత్నాలను కొద్ది కాలం వాయిదా వేయటం మంచిది.

## సింహం



కొత్త వ్యక్తులతో పరిచయం ఏర్పడుతుంది. కొంత మంది ప్రోత్సాహం ఎంతో చైతన్యం కలిగిస్తుంది. అతిథి మర్యాదలకు, గృహావసరాలకు, విలాస వస్తువులు కొనుగోలు చేస్తారు. నిర్మాణాత్మక పనులకు మిత్రుల ప్రోత్సాహం లభిస్తుంది. సహోద్యోగులు, అధికారుల వల్ల గుర్తింపు లభిస్తుంది. చేపట్టిన పనులు త్వరలో పూర్తయ్యే సూచనలు ఉన్నాయి.

## కన్య



చేయవలసిన పనులు ధైర్యంతో పూర్తి చేస్తారు. వృత్తి విషయంలో ఓర్పును పాటించటం అవసరం. విధుల నిర్వహణలో, వ్యాపారంలో మార్పులు జరుగుతాయి. రాజకీయాలు, సంఘాలు, యూనియన్‌లు మొదలైన కార్యాలకు అనుకూలం. బంధువులతో ప్రేమానురాగాలు పెంపొందే అవకాశం. కుటుంబ సభ్యులతో విహార యాత్రలు చేస్తారు.

## తుల



చిట్‌ఫండ్‌లు, ఉమ్మడి ఖాతాలు మొదలైన వాటికి చిక్కులు రావచ్చు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించండి. వృత్తి ఉద్యోగాల్లో పదోన్నతి/స్థల మార్పిడికి అవకాశం. ముఖ్యమైన పనుల్లో నైపుణ్యంగల వ్యక్తుల సహాయం లభిస్తుంది. లేఖలు, సమావేశాలు, సదస్సుల ద్వారా దూరపు మిత్రులు కలుస్తారు. వృత్తి రీత్యా ప్రయాణాలు, సమావేశాలు, విదేశీ గమనాలు అనుకూలిస్తాయి. సహోద్యోగులతో అనుబంధం పెరుగుతుంది.

## వృశ్చికం



ఇష్టం లేకపోయినా అధికారులతో, సహోద్యోగులతో స్నేహ భావంతో మెలగుతారు. వ్యాపారంలో అభివృద్ధి సాధిస్తారు. బ్యాంకు ఖాతాలు, లాకర్స్‌ను ప్రారంభించడానికి అనుకూలమైన సమయం. రాజకీయ, న్యాయ వ్యవహారాలు అనుకూలం. భూమి, వాహన, యంత్ర, గృహ సంబంధమైన కొనుగోలు ఒప్పందాలు సానుకూలం. ఆహార, ఆరోగ్య సలహాలు, సూచనలు తూచా తప్పకుండా పాటించండి.

## ధనుస్సు



ముఖ్యమైన చర్చలు ఫలిస్తాయి. ఉద్యోగంలో అనుకూల వాతావరణం ఏర్పడుతుంది. సహోద్యోగులు, ఇతర సిబ్బందికి మీ మనస్తత్వం అర్థంకాక మిమ్మల్నే అంటిపెట్టుకుని ఉంటారు. గ్రూపు రాజకీయాలకు దూరంగా వుండటం మంచిదని భావిస్తారు. కొన్ని అవినీతి పనులకు సంబంధించిన విషయాల సెగ మిమ్మల్ని ఇబ్బంది పెడుతుంది. వాస్తవాలను వెలికితీయాల్సిన బాధ్యత మీ పైన పడుతుంది.

## మకరం



భూ సంబంధిత వ్యవహారాలు అనుకూలంగా వుండటం వలన సాటివారిలో అసూయ పెరుగుతుంది. ముఖ్యంగా స్వజనుల వలన ఊహించని అధర్మ నిర్ణయాలు వినవలసి వస్తుంది. మీ వాహనం, ఇంటి సౌఖ్యానికి అవసరమైన సామగ్రి కుటుంబ సభ్యుల పేర్లతో వుండటం మంచిది. ఎప్పుడో చేసిన నిర్ణయాల తాలూకు ఫలితాలు ఇప్పుడు లభిస్తాయి. ఈ ఫలితాలు చాలా మందికి కంటగింపుగా మారతాయి.

## కుంభం



ఆర్థిక వ్యవహారాలు లాభిస్తాయి. రుణ సంబంధమైన చికాకులు పోతాయి. కోర్టు వ్యవహారాలు మూడు వంతులు మీకు అనుకూలంగా ఉంటాయి. స్త్రీల వల్ల ప్రయోజనాలు లభిస్తాయి. నిందారోపణలకు సిద్ధపడి కొన్ని బాధ్యతలు స్వీకరిస్తారు. గృహ ఖర్చులు తగ్గించడానికి చేసే యత్నాలు ఫలించకపోవచ్చు. కుటుంబ పెద్దల ఆరోగ్యం బాగవుతుంది.

## మీనం



నిర్మాణాత్మకమైన నిర్ణయాలు అమలు చేయడానికి తగిన వ్యక్తులు కలుస్తారు. ఆర్థిక ప్రణాళికలు నూతనమైన రూపురేఖలు దిద్దుకుంటాయి. రావలసిన బకాయిలకు గట్టి హామీ లభిస్తుంది. మానసులోని బాధను బయటకు చెప్పటం కొన్ని సందర్భాల్లో మంచిది కాదు. చిన్న చిన్న సమస్యల నుండి పెద్ద సమస్యల వరకూ అన్నింటినీ స్వయంగా పర్యవేక్షించాల్సి అవసరం కలిగిస్తుంది.

# వాస్తు దోషాలున్నాయా?


**వాస్తువార్త**

**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**

**డా॥ దంతూరి పండరినాథ్**

**3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్**

**సెల్స్: 9885446501/9885449458**




**జె.కౌశిక్ - విజయవాడ**

**ప్రశ్న: మా ఇల్లు తూర్పు సింహద్వారం, తూర్పు వీధి ఉంది. ఉత్తరంలో అయిదు అడుగుల ఖాళీ స్థలం ప్రహరీ. పడమరలో అర అంగుళం ఖాళీ స్థలం ప్రహరీ ఉంది. తూర్పు వీధి పారు చేరిన ఇల్లు. అదే విధంగా దక్షిణం కూడా పారు జేరిన ఇల్లు. అన్ని ద్వారాలు ఉచ్ఛంలో ఉన్నాయి. వంట ఆగ్నేయం, వాయవ్యంలో పూజ, ఉత్తర స్థలంలో బాత్‌రూమ్‌లు ఉన్నాయి. ఏవైనా వాస్తు దోషాలుంటే తెలుపగలరు.**

**జవాబు:** తూర్పున వున్న వీధిని పారు చేసుకుని ఇల్లు కట్టుకున్నారు. దక్షిణ సరిహద్దును పారు చేసుకుని కట్టుకోవచ్చు. కానీ తూర్పు సరిహద్దు నుండి తప్పకుండా కొంత స్థలాన్నయినా ఖాళీగా వదలాలి. అలా వీలు కానప్పుడు పశ్చిమాన అసలు ఖాళీస్థలం వదలి, తూర్పున అసలు ఖాళీస్థలం వదలలేదు. తూర్పున వీలయితే కనీసం మూడు అడుగుల ఖాళీ స్థలం వచ్చేలా ఇంటి తూర్పు భాగాన్ని మార్చండి. అలా వీలు కాని పక్షంలో పశ్చిమాన వున్న ఒకటిన్నర అడుగుల ఖాళీ స్థలం కూడా ఇంటి భాగంలోకి కలుపుతూ స్లాబు పెంచవలసి వస్తుంది. ద్వారాలన్నీ ఉచ్ఛ స్థానంలో వున్నప్పటికీ పశ్చిమ ఖాళీస్థలం ఎక్కువగా వుండటం వలన పనులు జరగకపోవడం లాంటి చెడు ఫలితాలు కనిపిస్తాయి. ఆ దుష్ఫలితాలు పోవాలంటే ఈ మార్పు తప్పదు. ఉత్తరాన వున్న బాత్‌రూమును కూడా నిర్మూలించవలసి ఉంటుంది.

## ఈ స్థలం కొనవచ్చా?

**సి.మహేందర్ - హైదరాబాద్**

**ప్రశ్న: ఈ స్థలం కొనవచ్చా? కొనకూడదా? ఈ స్థలం వల్ల కలిగే లాభ నష్టాలు వివరించగలరు.**

**జవాబు:** తూర్పు 13 అడుగుల వెడల్పు వుండి పశ్చిమాన 12.5 అడుగులు వుంటే అది దక్షిణ ఆగ్నేయం పెరిగిన స్థలమయినా కావచ్చు లేదా ఉత్తర ఈశాన్యం పెరిగిన స్థలమయినా కావచ్చు. అలాంటి స్థలం పొడవు వంద అడుగులు అయినప్పుడు అది తప్పకుండా ఇరుకు స్థలమే అవుతుంది. ఆ స్థలానికి ఉత్తర, దక్షిణాల్లో వున్న స్థలాలు వెడల్పులు ఈ స్థలం కంటే చాలా పెద్దవిగా చూపించారు. అంత వెడల్పు స్థలాల మధ్య వుంటే ఇలాంటి యిరుకయిన స్థలాలు సాధారణంగా చేతులు మారుతుంటాయి. మీరు కొన్నా తిరిగి అమ్మేసే పరిస్థితులు ఎదురవుతాయి. అటువంటి స్థలాలు కొనడం వల్ల ప్రయోజనం ఉండదు.

## ఉద్యోగం రావాలంటే?

**పి.సుభద్ర - హైదరాబాద్**

**ప్రశ్న: మా ఇంటి ద్వారం పడమర వైపు ఉంటుంది. వర్షం పడినపుడు డాబా మీద నీరు ఇంటి ముందున్న మెట్లపై నుండి పడమరకి(అంటే తూర్పు నుండి) పారుతూ ఉంటుంది. ఇంటి ముందు పల్లంగా కూడా ఉంటుంది. ఇంటి పెద్ద కుమారునికి రావలసిన ఉద్యోగం రాలేదు.**

**జవాబు:** వర్షంనీరు ఇంటి ఆవరణలోని ఖాళీస్థలంలో కురిసినప్పుడు ఈశాన్యంవైపు పారి అటు నుండి తూముల ద్వారా బయటకు వెళ్లాలన్నది సాధారణ వాస్తు నియమం. పశ్చిమ, దక్షిణాలకు వీధులున్నప్పుడు ఈశాన్య తూము ద్వారా నీటిని బయటకు పంపించటం కుదరదు. అయినప్పటికీ ఆవరణను ఈశాన్యానికి పల్లం వుండేలా సవరించుకోవాలి.

ఈశాన్యానికి ప్రవేశించిన నీరు ఈశాన్యంలోనే ఏర్పరచిన 'ట్రాప్' ద్వారా భూమిలోపలికి వెళ్లి అటునుండి పైపుల ద్వారా దక్షిణ ఆగ్నేయ స్థానం నుండిగానీ, పశ్చిమ వాయవ్య స్థానం నుండిగానీ బయటకు వచ్చి వీధిలోని కాలువలోకి వదలబడాలి. మీరు చెప్పిన ప్రత్యేక సమస్యలో ఇంటి ఆవరణలోని ఎత్తుపల్లాలలో కాకుండా కేవలం డాబా పైనుండి పడ్డ వర్షంనీరు మెట్లపై నుండి పశ్చిమానికి వాలుగా ప్రవహిస్తోందని పేర్కొన్నారు.

సమస్య కేవలం ఇదే అయితే మీ వాస్తు సమస్యకూ, అతనికి ఉద్యోగం రాకపోవడానికి సంబంధం లేదు. ఇంటి ఆవరణ అంతా పశ్చిమానికి పల్లంగా వుంటే దాన్ని సవరించుకోవడం వల్ల మంచి జరిగే అవకాశాలున్నాయి.

**తూర్పు దిక్కుకు అధిపతి ఇంద్రుడు. అన్ని పూజల్లో అగ్ర తాంబూలం అందుకునేవాడు. దిక్కుల్లో మొదటిది తూర్పు దిక్కు. ఉత్తరానికి అధిపతి కుబేరుడు. ధనాన్ని కరిపించే దేవుడు.**

**వాయవ్యానికి అధిపతి వాయువు..చలనం..తూర్పు, ఉత్తర, వాయవ్యాల్లో బరువులు పెట్టకూడదు. ఈ దిక్కుల్లో అతిభారం ఇంట్లో వుండేవాళ్లను పతనం గావిస్తుంది.**

**దక్షిణానికి అధిపతి యముడు. అటువైపు కాళ్ల చాపి పడుకుంటే మనసును వికలం చేసే కలలు వస్తాయి. పొద్దున లేవగానే యమద్వార దర్శనం అవుతుంది. ఆలోచనా సరళిలో క్రమేపీ మార్పులు వస్తూ చిన్న చిన్న విషయాలకు సైతం కలతలు ప్రారంభమై అనారోగ్యం పాలవుతారు. అందువల్ల నైరుతి గదిలో దక్షిణం వైపు తలపెట్టి పడుకుని నిద్ర లేవటంతోనే ఉత్తరం వైపు కుబేర స్థానాన్ని చూస్తూ కళ్లు తెరవాలి.**

**ఈశాన్యంమూల బరువులు వేయటం ఎంత పొరపాటో దక్షిణం వైపు, నైరుతి వైపు బరువులు వేయకపోవటం కూడా అంతే పొరపాటు.**

**నైరుతికి అధిపతి నిరుతి. ఆయుధాలు అమర్చుకోవలసిన చోటు. శతృభయాన్ని కడదేర్చే చోటు కూడా ఇదే. ఇక్కడ ఎంత బరువును వేస్తే అంత ఉత్తమం.**

# పదరంగం-17

**కూర్పు: పోపూరి విశ్వనాథ్**

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | | 2 | | 3 | ■ | 4 | | 5 |
| | ■ | ■ | | ■ | 6 | | | ■ | |
| 7 | 8 | | | ■ | | ■ | ■ | 9 | |
| ■ | | ■ | ■ | 10 | | | 11 | ■ | |
| 12 | | 13 | | ■ | | ■ | 14 | | |
| | ■ | | ■ | 15 | ■ | 16 | | ■ | ■ |
| | ■ | ■ | 17 | | ■ | | ■ | 18 | 19 |
| 20 | | 21 | | ■ | 22 | | 23 | ■ | |
| ■ | ■ | | ■ | 24 | | ■ | 25 | | |
| 26 | | | | ■ | 27 | | | ■ | |

## ఆధారాలు

### అడ్డం

1. కోరిన భక్తులందరికీ వరాలిచ్చేవాడు కనుక శివుణ్ణి ఇలా అంటారు (6)
4. చూచు (3)
6. క్షేమం (3)
7. వేదిక మీద అటు నించి ప్రదర్శింపబడేవి (4)
9. ప్రియం, ఇష్టం (2)
10. పెళ్లిలోని ఎదురు సన్నాహం తిరగబడింది (4)
12. పిదప (4)
14. మెత్తని శయ్య సరిగా లేదు (3)
16. స్థానం, వద్ద (2)
17. ఒక రంగు, ఒక రత్నం కూడా (2)
18. లాభం, మిగులు (2)
20. తెలుగులో కాంట్రాక్టరు (4)
22. కాల్చి వాత పెట్టుట. మందలింపుకు కూడా వాడతారు (3)
24. జాబితా (2)
25. శుభ కార్యాలకు ఇంటి ముందు వేసేది తిరగబడింది (3)
26. అంతా ఒకటే అనే భావన (4)
27. ఎదురు తిరిగిన గూఢచారులు (3)

### నిలువు

1. తెలంగాణా ప్రాంతపు పండుగ (3)
2. ఈ 'చైనా' జబ్బు ప్రభావం ఇంకా పోలేదు (3)
3. పైకొచ్చిన వాసుకి తమ్ముడు, అతిక్రూరుడు (5)
4. దేశాలు తిరగాలంటే ఇది కావాలి (2)
5. అరుదుగా వస్తూ '22 నిలువు' చూడడం (5)
8. లోభం, అత్యాశ (3)
11. పైర్లు, చెట్లు బాగా పెరగడానికి వేసేది (3)
12. అన్నిటికంటే కింద (4)
13. రెండు సోలల ప్రమాణం (2)
15. నూతిలో వస్తువులు పడిపోతే దీనితో తీస్తారు (2)
16. ఒక పూవు, జబ్బు కూడా (3)
17. నారు పోసినవాడే ఇది కూడా పోస్తాడు అని సామెత (2)
19. విరిగిన చక్కెర (4)
21. అంతులేని కార్చిచ్చు (3)
22. బంధువులు (3)
23. వంటలలో రుచి కోసం వేసే ఆకుకు అంతులేదు (3)

## పదరంగం-15కి జవాబులు పంపించినవారు

1. లింగంపల్లి భిక్షపతి-బోడుప్పల్; 2. వేలూరి వివేకానంద-సికింద్రాబాద్; 3. వుమ్నా రంగారెడ్డి-హైదరాబాద్; 4. గుంట్రాతి సుబ్రహ్మణ్యం గౌడ్-రాజంపేట 5. తోట గురుస్వామి-దువ్వూరు 6. యం.వి. రమణకుమారి-హైదరాబాద్; 7. కె.ఎస్.మణికంఠ-ములుగు 8. సి.శశిధర్-ఖమ్మం

జవాబులు పంపించాల్సిన చిరునామా:

**పదరంగం** ఆదివారం వార్త, నం.396,

**లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.**

పేరు : ..............................................


..............................................

ఊరు : ..............................................


## పదరంగం-15 జవాబులు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| వా 1 | గ్దా | నా 2 | లు | ■ | డి 3 | ■ | ప 4 | టా 5 | లం |
| ■ | ■ | సి | ■ | కా 6 | లే | యం 7 | ■ | రో | ■ |
| ఏ 8 | మ | ర | పా | టు | ■ | న్యా 9 | ఉ | ప | సం 10 |
| కా | ■ | కం | ■ | క 11 | ర 12 | అ | ■ | ■ | పా |
| క్రి 13 | టుం 14 | ■ | ము 15 | ■ | సి | ■ | తు 16 | మ్మె | ద |
| ■ | గీ 17 | టు | రా | యి | ■ | కం 18 | ద | ■ | కు |
| శి 19 | ■ | ■ | యం | ■ | ఆ 20 | ■ | కు 21 | లు 22 | డు |
| బా 23 | అ | ■ | చు 24 | ప్ప | నా | తి | ■ | యా | ■ |
| ర | ■ | వం 25 | ■ | ■ | మి | ■ | తొ 26 | డ | మ |
| వా 27 | స | క | స | జ్జి | క | ■ | ■ | క | ■ |


# ఈ వారం కా‘ర్టూన్స్’



గెలిచిన వాళ్లంతా 'ఇదే పార్టీలో ఐదేళ్లు ఉంటాం' అని ప్రమాణం చేయించండి ముందు..!!
- అధిష్టానం -
Zakir...





..క్యాబినెట్ మినిస్టర్లెవరూ లేరు.. అందరూ డిప్యూటీ సీయంలే!!
Zakir...

నోరు 'హద్దుల్లో' పెట్టుకోని వారెవరూ గెలవ లేదు చూశారా..?!
Zakir...







ప్రపంచంలోని
అతి పొడవైన ఎస్కలేటర్ ఇది.
పర్యాటకులను ఆకర్షించడం కోసం
దీనిని ఏర్పాటు చేసారు. చైనాలోని హుబే
ప్రావిన్స్‌లోని ఎన్షి పట్టణ సమీపంలో ఓ
కొండపై ఉందీ ఎస్కలేటర్. అరుదైన సైట్
సీయింగ్ ఎస్కలేటర్‌గా గుర్తింపు పొందింది.
దీని ద్వారా కొండపై నుండి కిందికి
దిగడానికి పద్దెనిమిది నిమిషాలు
పడుతుంది.







